1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ రీజియన్
శుక్రవారం | డిసెంబర్15,2023 | www.navatelangana.com

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన కుంభం



నవతెలంగాణ-భువనగిరిరూరల్

సచివాలయంలో నీటి పారుదల , పౌరసరఫరాల శాఖ మంత్రిగా పదవి బాధ్యత స్వీకరించిన నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి , రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రిగాప్రమాణ స్వీకారం చేసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను సచివాలయంలోని వారి చాంబర్ నందు గురువారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ, చేనేత మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వాయిదా పడిన పశువుల సంత వేలం

నవతెలంగాణ -ఆత్మకూర్ ఎస్

మండల పరిధిలోని నిమ్మికల్ పశువుల సంత వేలంపాట గురువారం నిర్వహించాల్సి ఉండగా వాయిదా పడింది. వేలం పాటకు రావలసిన పాటదారులు సమయానికి రాకపోవడంతో సంత వేలంపాటలు వాయిదా వేసినట్లు డీఎల్పీఓ సాంబిరెడ్డి తెలిపారు. మొత్తం నాలుగు డీడీలు రాగా వేలంపాటి సమయానికి సకాలంలో పాటదారులు హాజరు కాకపోవడంతో సంత వేలం ను ఈనెల 21వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్సూర్ నాయక్ ఎంపీఓ సంజీవ, సర్పంచ్ దావీదు ఎంపీటీసీ ముత్తయ్య, ఉప సర్పంచ్ ఉపేందర్, పంచాయతీ కార్యదర్శులు హరికృష్ణ శమీ, నాగరాజు, సైదులు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు క్రాప్ హాలిడే..



- అధికారికంగా ప్రకటించిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో మూడు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు
- యాసంగికి నీళ్లు బంద్

కరువుతో 20 ఏండ్ల తరువాత నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రభుత్వం ప్రకటించింది. ఎగువ రాష్ట్రాలలో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు తక్కువగా వచ్చింది. ప్రాజెక్టు లో నీటి నిల్వ డెడ్ స్టోరేజికి చేరుకుంది. కృష్ణా క్యాచ్‌మెంట్ ఏరియాలో ఈ ఏడాది వర్షాలు అతి తక్కువగా పడడంతో తెలంగాణ, ఆంధ్రా పరిధిలోని జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు నీరు స్వల్పంగా చేరింది. దీంతో ప్రాజెక్టుల్లో సరిపడా నీరు లేకపోవడంతో సాగునీటి ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్ కింద తెలంగాణ ప్రభుత్వం క్రాప్ హాలిడేను ప్రకటించింది. ఈ ఏడాది యాసంగి పంటకు సాగునీరు విడుదల చేయలేమని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించింది. దీంతో ఈ యాసంగి పంటలు వరి సాగు అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. వరి తప్ప వేరే పంటలు సాగు చేయని ఆయకట్టు రైతులు బోర్లు బావుల ద్వారా వరి సాగు చేసే ప్రయత్నాలు చేస్తున్నారు

నవతెలంగాణ-మిర్యాలగూడ

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో మేజర్ల కింద 3.03.350 ఎకరాలు ఆయకట్టు ఉండగా 41 ఎత్తిపోతల పథకాల కింద 90,912 ఎకరాలు ఉంది. మొత్తం 3,94,285 ఎకరాలకు సాగునీరు అందేది. క్రాప్ హాలిడే కారణంగా ఈ ఆయకట్టు మొత్తం బీడుగా మారే పరిస్థితి ఉంది. ప్రస్తుతం నాగార్జుసాగర్ 522.80 అడుగుల నీటి మట్టం మాత్రమే ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల అవసరాల మేరకు 505 అడుగుల వరకు నీటిని వినియోగించుకునేందుకు ఒప్పందం జరిగింది. ఈ నేపథ్యంలో 510 అడుగుల కంటే నీటి మట్టం తగ్గితే హైదరాబాద్ తాగునీటిపై ప్రభావం చూసే పరిస్థితి ఉంటుంది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల కృష్ణా బేసిన్‌లో వర్షాలు తక్కువగా పడడంతో తెలుగు రాష్ట్రాల పరిధిలోని ప్రాజెక్టులకు సుమారు 150 టీఎంసీల నీరు మాత్రమే ఇన్‌ఫ్లో వచ్చింది. భారీ ఇన్‌ఫ్లో ఉంటేనే రెండు తెలుగు రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లో లేకపోవడంతో సాగునీటి అవసరాలను పక్కకు పెట్టారు. ఈ క్రమంలోనే సాగర్ ఎడమకాల్వ కింద సాగునీటిని విడుదల చేయలేదు.

75వేల ఎకరాల్లో బోరు బావుల ద్వారా వరిసాగు

నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో బోరుబావులు, ఊటబావుల ద్వారా రైతులు సుమారు 75వేల ఎకరాల్లో యాసంగి వరిసాగు చేస్తున్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరు ఆధారంగా స్వల్పకాలిక వరివంగడాలను నాటు వేస్తున్నారు. ఈ ఆయకట్టుకు ఈ మూడు నెలల పాటు సరిపడా విద్యుత్ అందితేనే వరిసాగు గట్టెక్కనుంది.

బీళ్లుగా మారనున్న 3.19లక్షల ఎకరాలు

నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో పదేండ్ల తరువాత రైతుల భూములు సుమారు 3.19లక్షల ఎకరాలు బీళ్లుగా మారనున్నాయి. యాసంగి సీజన్‌లో కేవలం నీటి ఆధారంగానే మెట్ట పంటలైన వేరుశెనగ, కంది, పెసర, మినుము వంటి పంటలు పండిస్తారు. సాగర్ ఆయకట్టులో ఈ పంటలు పండించేందుకు రైతులకు నీటి వసతి లేకపోవడంతో ఆయకట్టు పూర్తిగా బీళ్లుగా మారే పరిస్థితి ఉంది. ఆయకట్టులో కేవలం నీటి వసతి ఉన్న 75వేల ఎకరాల్లో మాత్రమే వరిసాగు చేస్తున్నారు.మిగిలిన 3.19 లక్షల ఎకరాల్లో నీటి వసతి లేకపోవడం వల్ల మెట్టపంటలు కాని వరి సేద్యం కాని చేసే పరిస్థితి లేకుండా పోయింది. కాగా 2003లో ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రాఫ్ హాలిడేను ప్రకటించగా 20 సంవత్సరాల తరువాత వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ యాసంగిలో ప్రభుత్వం క్రాప్ హాలిడేను ప్రకటించింది.

వరి బదులు మెట్ట పంటలే మేలు...

ఆయకట్టు పరిధిలో రైతులు ఎక్కువగా వరిసాగు వైపు దృష్టిసారిస్తున్నారని మెట్టపంటలు సాగు చేస్తేనే ఎక్కువ మొత్తంలో భూమిలో పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కాగా సాగర్ ఆయకట్టు పరిధిలో వరి మినహా ఇతర పంటలేవి కూడా ఆశించిన స్థాయిలో గతంలో దిగుబడి రాకపోవడంతో రైతులు నీటి వసతి ఉన్నవారు వరిసాగు వైపు దృష్టి సారిస్తున్నారు.

యాసంగికి నీటి విడుదల ఉండదు
నాగార్జునసాగర్ ప్రాజెక్టు సీఈ అజయ్ కుమార్

ఈ సీజన్లో సాగునీరు విడుదల ఉండదని మెట్ట పంటలు వేసుకోవాలని ప్రాజెక్టు సీఈ అజయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టులో ఆశించిన మేరకు నీటి నిల్వ లేదని సాగునీటికి నీటి విడుదల చేసే అవకాశం ఉండదని రైతుల ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మెట్ట పంటలు వేసుకోవాలని సూచించారు. నీటి విడుదల ఉంటుందని ఆశతో వరి సాగు చేసుకుని నష్టపోవద్దని కోరారు.



విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

- పీహెచ్‌సీల ఆకస్మిక తనిఖీలు
- నార్మల్ డెలివరీ లపై అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

వైద్య ఆరోగ్యశాఖలో పని చేయుచున్న అందరూ సూపర్ వైజర్లు విధిగా క్షేత్రస్థాయిలో సందర్శించి విధులను బాధ్యతతో నిర్వర్తించాలని, ఉల్లాఘించిన వారిపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ శ్రీ ఎస్. వెంకట్రావు అపాకపనేజ గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆరోగ్య శాఖ సూపర్ వైజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధుల ను సమర్థవంతంగా నిర్వర్తిచాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు. సాధారణ కాన్పుల పై అవగాహన కల్పించాలన్నారు. సూపర్ వైజర్ల విధులు, బాధ్యతలు క్షేత్ర స్థాయి సందర్శనలను సూపర్ వైజర్లని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సూపర్ వైజర్లు అందరూ తమ ముందస్తు ప్రణాళిక,సందర్శన వివరములు నమోదు చేయాలన్నారు. ఆరోగ్య సేవలు ప్రజలకు అందేటట్లు అవగాహన కల్పించాలన్నారు. మెడికల్ ఆఫీసర్, ప్రోగ్రాం అధికారులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశములు పాటించి విధులు నిర్వహించాలన్నారు. అలస్యత్వం, నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవన్నారు. ఇకనుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేస్తానని తెలిపారు.సూపర్ వైజర్లు అందరూ సాధారణ కాన్పుల పై అవగాహన కల్పించి ఆపరేషన్ ప్రసవాలను తగ్గించాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు పెంచుటకు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ పేదలకు అందుబాటులో ఉండి, సకాలంలో ఆరోగ్య సేవలు అందించాలని కలెక్టర్ అన్నారు. సూపర్ వైజర్లు పెద్ద సమాచార వవ్యస్థ అని, ప్రతి ఆరోగ్య కార్యక్రమము పై అవగాహన, విస్తృత ప్రచారము నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.డిప్యుటేషన్ పై పనిచేస్తున్న సిబ్బంది వివరాలు సమర్పించాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశమునకు గైరాహాజరు అయిన సూపర్ వైజర్ల పై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెల ప్రోగ్రాం అధికారులు అందరూ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి , జిల్లాలోని ఉప కేంద్రములు సందర్శించి క్షేత్ర స్థాయి లో ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించి లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కోటాచలం, డిప్యూటీ డిఎంహెచ్ఓ ఎండి నిరంజన్, ప్రోగ్రాం అధికారులు డా. నాజ్య కళ్యాణ్, సాహితి , ఆరోగ్య సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

గడ్డం ప్రసాద్ ఎంపిక దళిత జాతికి గొప్ప వరం

- ఎమ్మెల్యే వేముల వీరేశం



నవతెలంగాణ-నకిరేకల్

తెలంగాణ శాసనసభ స్పీకర్ గా గడ్డం ప్రసాద్ కుమార్ ఎంపిక దళిత జాతికి గొప్ప వరమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ అసెంబ్లీలో స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపే కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమరిని శాసనసభాపతిగా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. 1964లో జన్మించిన స్పీకర్ అనేక కష్టాలలో, బాధలలో నుండి ఎదిగారని, విద్యార్థి, యువజన నాయకుడిగా సమాజాన్ని అన్ని రకాలుగా చూసిన వ్యక్తి అని కొనియాడారు. పెద్దలు వెంకటస్వామితో ఉన్న అనుబంధం, వారి అనుభవం శాసనసభాపతి స్థానానికి దోహద పడుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. శాసనసభలో ఆరోగ్యకరమైన చర్చ జరగాలని, తమరికి స్పీకర్ గా సముచిత స్థానం ఇచ్చినందుకు అన్ని పక్షాలు స్వాగతించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. శాసనసభను ప్రజల ఆలోచనలకు, మనోభావాలకు, అభిప్రాయాలకు అనుగుణంగా నిర్వహించాలని కోరారు, పేదల కష్టాలు తీర్చే శాసనసభ గా ఈ సభలో చర్చలు జరిగే విధంగా శాసనసభను నడపాలని ఆకాంక్షించారు.

పొంగులేటికి సన్మానం..

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సచివాలయంలోని ఆయన చాంబర్ లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. అదేవిధంగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మంత్రినికలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఉచిత బస్సులతో .. మా పొట్ట కొట్టొద్దు

- గడియారం సెంటర్లో ఆటో డ్రైవర్ల ఆందోళన

నవతెలంగాణ-నల్లగొండ టౌన్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇప్పుడు రాష్ట్రంలో ఆందోళనలకు కారణంగా మారింది. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 గ్యారంటీలలో మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ హామీని నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళలకు ప్రయాణం ఉచితం చేసింది. దీంతో మహిళలు బస్సుల బాట పట్టారు. పెద్ద సంఖ్యలో బస్సులలోనే ప్రయాణం చేస్తూ తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఇక ఈ పరిణామాలు ఆటోవాలాల కడుపు కొడుతుందని గురువారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్లో ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆటో డ్రైవర్లు రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించడం వల్ల తమకు ఉపాధి పోయిందని వారు లబోదిబోమంటున్నారు. అప్పులు చేసి ఆటోలు కొనుక్కొని జీవనం సాగిస్తున్న తమకు అప్పుల భారం పెరిగి జీవితం మరింత దుర్భరంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం తీసుకునే ముందు రవాణా పై ఆధారపడిన తమ వంటి వారి గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు. ఉచిత బస్సు పథకాన్ని వెంటనే రద్దు చేయాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాస్తారోకో నిర్వహించిన ఆటో డ్రైవర్లు ప్రభుత్వ వైఖరి పై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఏది ఏమైనా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తర్వాత పరిణామాలు ఏమీ ఆలోచించకుండా తీసుకుంటుందని ఉచిత బస్సు ప్రయాణం కూడా అటువంటిదేనని ఆటో డ్రైవర్లు చెబుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బి ఆర్ టి వి ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు వాజీద్ నాజర్ అలీ, నాయకులు కలగోని యాదగిరి గౌడ్, పర్వేజ్,జహంగీరు, వెంకన్న, సైదులు, తదితరులు పాల్గొన్నారు.



జిట్టాకు ఘన సన్మానం

నవతెలంగాణ-వలిగొండరూరల్

తెలంగాణ ఉద్యమ నాయకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జిట్టా బాలకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా భువనగిరి లోని ఆయన ఫామ్ హౌస్ లో గురువారం వలిగొండలోని జిట్టా యువసేన నాయకులు పూల బోకే శాలువాతో ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో నానచర్ల రమేష్, మస్కు నర్సింహా, కొండూరు సత్తయ్య, లవ కుమార్, అంబటి మోహన్, యాదగిరి, మత్స్యగిరి,నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు చోరీ వ్యక్తి రిమాండ్

నవతెలంగాణ -రామన్నపేట

ధాన్యం డబ్బులు చోరీ చేసిన సంఘటనలో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు స్థానిక ఎస్సై లక్ష్మయ్య తెలిపారు. గురువారం మండలకేంద్రంలో ఎస్ఐ విలేకర్లకు వివరాలు వెల్లడించారు. మండలంలోని జనంపల్లి గ్రామానికి చెందిన మేడబోయిన సైదులు వారం రోజుల క్రితం ధాన్యం డబ్బులు రూ.99 వేల రాగా వాటిని తన ఇంట్లోని బీరువాలో పెట్టి తాళం వేశారు. ఇంటికి తాళం వేసి తాళం చెవిని ఇంటి తలుపుపై పెట్టి కుటుంబ సభ్యులు పొలం పనుల నిమిత్తం వెళ్లిపోయారు. గురువారం డబ్బులు అవసరం ఉండగా బీరువా తాళం తెరిచి చూడగా బంగారం ఇతర నగలు ఉండి నగదు మాత్రమే అపహరణకు గురైంది. స్థానిక పోలీసులకు సైదులు ఫిర్యాదు చేస్తూ గ్రామానికి చెందిన నడిగోటి నరేష్ పై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ దిశగా పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు నేరాన్ని ఒప్పుకున్నారు. దీంతో నడి కొట్టి నరేష్ ను రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రాజాపేట

మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన పులి వీరాంజనేయులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబానికి బేగంపేట హెల్పింగ్ హాండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 8వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గొడెల్లి రాజేష్ గౌడ్, మంత్రాల సుమన్, చిగుర్ల గణేష్, గౌర వినయ్, దేవనపల్లి గణేష్, గడ్డమీది మహేష్, జక్కుల రమేష్ , భోగ దినేష్, పంబ నరేష్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

- డీఈవో నారాయణరెడ్డి



నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

ఉపాధ్యాయులు సాంకేతికతను ఉపయోగించుకుని ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచాలని యాదాద్రి భువనగిరి డీఈవో నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు తెలంగాణ అమెరికా తెలుగు అసోసియేషన్(టిటిఎ) ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధి బండారి మయూరి రెడ్డి గురువారం మండలంలోని 25 ప్రాథమిక ప్రాథమిక పాఠశాలకు రూ.4 లక్షల విలువ గల స్మార్ట్ టీవీలను అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో డీఈవో మాట్లాడారు.పాఠశాలలు భవిష్యత్తు సమాజం గురించి ఆలోచించే సంస్థలన్నారు. పోటీ ప్రపంచంలో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు.స్మార్ట్ టీవీ లను ఉపయోగించుకుని విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు.ప్రభుత్వ పాఠశాలలకు స్మార్ట్ టీవీలో అందజేసిన టిటిఎ సభ్యులను అభినందించారు.విద్యాభివృద్ధికి సహకరించిన వారిని విద్యార్థుల జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు.ఈ కార్యక్రమంలో టిటిఎ అధ్యక్షులు వంశిరెడ్డి,ఎంపీపీ గుత్తా ఉమాదేవి, జెడ్పీటీసీ వీరమల్ల భానుమతి, సర్పంచ్ సికిలమెట్ల శ్రీహరి,ఎంపీటీసీ బి.గాలయ్య,వలిగొండ ఎంపీపీ నూతి రమేష్ బాబు,ఎంపీడీవో ఆవుల రాములు,ఎంఈఓ శ్రీధర్,టిటిఎ ప్రతినిధులు సురేష్,గణేష్,సంతోష్, గ్రామపంచాయతీ కో ఆప్షన్ నెంబర్ గౌసుద్దీన్ ఖురేషి,పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, ఎస్ఎంసి చైర్మన్లు,సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఫిషర్ మెన్ కాంగ్రెస్ చైర్మెన్‌గా సామల ధర్మరాజు



నవతెలంగాణ-భువనగిరి

రాష్ట్ర ఫిషర్ మెన్ కాంగ్రెస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ యాదాద్రి భువనగిరి జిల్లా ఫిషర్ మెన్ కాంగ్రెస్ చైర్మెన్‌గా సామలధర్మరాజు ని నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనపై పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షులు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాంచందర్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షులు బండారు నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా జానికి రాములు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు షూ పంపిణీ



నవతెలంగాణ-వలిగొండరూరల్

మండలంలోని గోకారం, జాలుకాల్వలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చౌటుప్పల్ లోని దివీస్ లేబరేటరీ వారి సౌజన్యంతో స్కూల్ బ్యాగులు, షూ పంపిణీ చేశారు. ఈ సందర్భముగా దివీస్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకొని పాఠశాలకు పుట్టిన గ్రామానికి మంచి పేరు తెచ్చి పెట్టాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తుర్కపెల్లి మాధవి సురేందర్, మద్దెల సందీప్, దివిస్ సిఎస్ఆర్ ఇన్చార్జ్ వల్లూరు వెంకట్ రాజు, సాయి కృష్ణ, ప్రధానోపాధ్యాయులు యాదయ్య, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి ఒక చోట... ఏర్పాటు మరోచోట

- మద్యం దుకాణం ఏర్పాటులో వివాదం



నవతెలంగాణ -మిర్యాలగూడ

మిర్యాలగూడః మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో నిబంధనలను పాటించాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ మద్యం అనుమతి పొందన వారు నిబంధనల మేరకు ఒక బోటు ఏర్పాటు చేయాల్సి ఉండగా మరో చోట మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తుండడంతో వివాదాలకు కారణమవ్వతుంది. ఈ ఏడాది ఆగస్టు 4న నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 155 మద్యం దుకాణాలకు గాను ఎక్సైజ్ శాఖ అధికారులు నోటిఫికేషన్ జారీ చేయగా బహిరంగ వేలం నిర్వహించారు. దుకాణాలను నిబంధనల ప్రకారం ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయమై ఎక్సైజ్ అధికారులు సంబంధిత వేలం నోటీసులో పొందుపరిచారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 1న నూతన మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోగా మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీ మద్యం దుకాణం ఇప్పటివరకు ప్రారంభించలేదు. సదరు మద్యం దుకాణం ఏర్పాటులో వివాదం చోటు చేసుకోవడంతో 15రోజులు గడువు దాటినా మద్యం దుకాణాన్ని ప్రారంభించలేదు. నిబంధనల మేరకు బహిరంగ వేలంలో దుకాణాన్ని దక్కించుకున్న వ్యక్తిని దుకాణం ఏర్పాటు చేయకుండా కొందరు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో లైసెన్స్ పొందిన వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా రెడ్డికాలనీ దుకాణం ఏర్పాటు చేసేందుకుగాను సన్నాహాలు చేస్తున్నారు. తమదైన శైలిలో దుకాణం ఏర్పాటు చేయకుండా అంగ, అర్థబలం ఉపయోగిస్తుండగా అధికారులు సైతం అడ్డుకోలేని పరిస్థితి నెలకొంది. గతంలో సిండికేట్ నిర్వహించి అక్రమాలకు పాల్పడిన కొందరు తామే మరోసారి దందా చేసేందుకుగాను ముందస్తు వ్యూహంతో దుకాణం ఏర్పాటును అడ్డుకుంటున్నారని తెలుస్తుంది.

సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తాం...
మహేశ్వర్‌రెడ్డి (ఎక్సైజ్ సీఐ)

రెడ్డీకాలనీ మద్యం దుకాణం ఏర్పాటు చేసే విషయంలో దుకాణాల వారి మధ్య కొంత వివాదం నెలకొన్న మాట వాస్తవమే. ఎవరి గెజిట్ పరిధిలో వారు దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని మేము సూచించాం. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేయనివ్వం. స్థలం మార్పు విషయం సమస్యను ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు నివేదిస్తాం.

స్వయం ఉపాధితో యువత ఆర్థికంగా ఎదగాలి

- టీపీసీసీ క్యాంపెనింగ్ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ కేఎల్ఎన్ ప్రసాద్

నవతెలంగాణ-కోదాడరూరల్

స్వయం ఉపాధితో యువత ఆర్థికంగా ఎదగాలి అని టీపీసీసీ క్యాంపెనింగ్ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు.గురువారం మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో ప్రొప్రయిటర్లు కాసాని శివకుమార్, కాసాని కొండ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ దగ్గర శివాలయం రోడ్డు లో నూతనంగా ఏర్పాటు చేసిన శివ మెడికల్ జనరల్ స్టోర్స్, త్రివేణి ఎంటర్ప్రైజెస్ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ల ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బాలే బోయిన పాపారావు, రాజు, కొండ సైదులు, కాసాని వీరబాబు, గురవయ్య, సుబ్బయ్య, కాసాని శ్రీనివాసరావు, కాసాని బ్రహ్మం ,చిన్న వీరయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రతిని అందజేత

నవతెలంగాణ-నేరేడుచర్ల

నేరేడుచర్ల మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాసం పెడుతూ సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్ వాజిద్ కు 10 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన ప్రతిని గురువారం ఆయన కార్యాలయం లో అందజేశారు.మున్సిపల్ చైర్మన్ పై అవిశ్వాసం పెట్టాలని 1 వార్డు : కొణతం చిన్న వెంకటరెడ్డి, 2 వార్డు రణపంగా నాగయ్య,5 వార్డు అలక సరిత,8 వార్డ్ కౌన్సిలర్ సీపీఐ(ఎం) సభ్యురాలు కొదమగుండ్ల సరిత.9వ వార్డు బానోతు లలిత, 10 వార్డు నూకల సుగుణమ్మ, 11 వార్డు బచ్చల కూరి ప్రకాష్, 12 వార్డు బైరెడ్డి జితేందర్ రెడ్డి,14 వార్డు వేమూరినాగమణి,15 వార్డు కుంకు సులోచన అవిశ్వాస తీర్మానం పెట్టాలని ప్రతిని అందజేశారు. గురువారం సాయంత్రం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నీలిగొండ వెంకటేశ్వర్లకు అవిశ్వాస తీర్మానం ప్రతిని అందజేశారు. కాకా ప్రస్తుత మున్సిపల్ చైర్మెన్ సెలవులో ఉన్నట్లు కమిషనర్ తెలిపారు.

ఎన్నికల జాతర షురూ

- సర్పంచ్, ఎంపీటీసీ,జెడ్పీటీసీ, ఎంపీ ఎన్నికలు
- పల్లె బాట పడుతున్న ఆశావహులు, ఏర్పాట్లలో రాజకీయ పార్టీలు, అధికారులు,
- మళ్లీ అమల్లోకి రానున్న కోడ్

నవతెలంగాణ-సూర్యాపేట

వచ్చే ఏడాది 2024 లో జనవరి నుంచి మే వరకు వరుసగా ఆరు నెలలు ఎన్నికల జాతర షురూ కానున్నది.దీంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఖాళీగా ఉన్న రాజకీయ నిరుద్యోగులకు రానున్న ఎన్నికల జాతర వరంగా మారనున్నది.నూతన సంవత్సరంలో జనవరిలో జరుగుతాయని భావిస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది.ఇదిలావుండగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి జరగబోయే సర్పంచ్, ఎం పి టి సి, జెడ్ పి టి సి ఎన్నికలను పార్లమెంట్ ఎన్నికల లోపే నిర్వహిస్తారా లేకపోతే ఎన్నికలు పూర్తి అయిన తర్వాత నిర్వహిస్తారా అనేది సందిగ్ధత నెలకొంది. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో భారీ ఎత్తున స్థానాలను సాధించి పెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొని అన్నిట్లో కూడా క్లీన్ స్వీప్ సాధించే దిశగా సీఎం రేవంత్ రెడ్డి పార్టీ యంత్రాంగానికి దశ దిశ చూపే అవకాశం ఉంది. శాసనసభ ఎన్నికల సందడి ముగిసిపోయిన తరువాత యూటర్న్ తీసుకోకముందే స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. ఈ క్రమంలోనే జనవరి నెల నుండి మే నెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికల వరకు వరుసగా ఆరు నెలల పాటు ఎన్నికలు జరగనున్నాయి.ఈ క్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో పదహారు ఎంపీ స్థానాలను కైవసం చేసుకుని జాతీయ రాజకీయాలలో తెలంగాణ సత్తా చాటేందుకు కాంగ్రెస్ సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. కాగా జనవరి నెలలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాటు చేసుకుంటున్నారు. అదేవిధంగా జనవరిలో పంచాయతీ ఎన్నికల అనంతరం ఏప్రిల్,మే నెలలో ఎం పి టి సి, జెడ్ పి టి సి ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఇది కాక మే నెలలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. వరసగా ఆరు నెలల పాటు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆశావహులు పల్లె బాట పడుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అధికారుల ఏర్పాట్లు, యంపీ ఎన్నికలకు గాను ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టినా నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ఆశావహులు గ్రామాలలో పర్యటనలను మొదలు పెట్టడానికి సిద్ధపడుతున్నారు. ఈ క్రమంలో పల్లె పోరు కు రాజకీయ పార్టీలు, అధికారులు సిద్ధపడుతున్నారు. ప్రధానంగా జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా తండాలు గ్రామపంచాయతీ లుగా మారాయి. ప్రస్తుతం బీసీ ఓటర్ల గణన ప్రారంభమైంది. జనవరి నెలలో మూడు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. ఇదిలా ఉండగా కొన్ని గ్రామ పంచాయతీలు పురపాలక సంఘాలలో విలీనమైన విషయం విధితమే. అదేవిధంగా ఎంపిటిసి, జెడ్పిటిసి ల పదవీ కాలం మే నెలతో ముగియనున్నందున వీటికి కూడా ఎన్నికలు జరిగే అవకాశం ఉంది దాదాపుగా ఆరు నెలలపాటు మరోమారు ఎన్నికల జాతర జిల్లాలో కొనసాగనున్నది. ఈ జాతర తో రాజకీయ పదవులు లేనివారు ఆశావహులకు పదవులపై ఆశలు చిగురిస్తున్నాయి. అదేవిధంగా ఈ నెల చివరి లో షెడ్యూల్ విడుదలైతే మరోమారు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే అవకాశం ఉంది. ఏదేమైనప్పటికీ అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే ఇంకా తేరుకోకముందే గ్రామపంచాయతీ ,ఎంపీటీసీ, జడ్పిటిసి, పార్లమెంటు ఎన్నికలు వస్తుండడంతో రాజకీయ పార్టీలలో మరోమారు ఎన్నికల వేడి రాజుకోనున్నది.



గుండెబోయిన గూడానికి బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-పాలకీడు



మిర్యాలగూడ నుండి గుండెబోయిన గూడెం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఎం పార్టీ పాలకవీడు మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పాలకవీడు మండల కేంద్రం అయినప్పటికీ మండలంలోని గ్రామాల ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం నేరేడుచర్ల, మిర్యాలగూడ వెళ్తుంటారని,వారికి బస్సు సౌకర్యలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యాలను రద్దు చేసిందని ఆయన అన్నారు.గత 20 సంవత్సరాల క్రితం పోలిస్తే అప్పుడే బస్సు సౌకర్యాలు బాగా ఉన్నాయని పాలకీడు మండలంలోని గుండెబోయిన గూడెం జాన్పాడు దర్గా వరకు సూర్యాపేట డిపో మిర్యాలగూడ డిపో వారు బస్సులు నడిపారని ఇప్పుడు ఎత్తివేసారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించటం హర్షినియమన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఉచిత బస్సు సౌకర్యం ఉపయోగపడాలంటే మిర్యాలగూడ నుండి గుండెబోయిన గూడెం మూడు ట్రిప్పులు బస్సు నడపాలని, అదే విధంగా జాన్పాడు దర్గాకు బస్సులు నడపాలని సూర్యాపేట జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే పాలకీడు మండల వాసులకి ఇబ్బందిగా ఉందని సూర్యాపేట డిపో నుండి కూడా జాన్పాడు దర్గాకు బస్సులు నడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే క్రమంలో మహాలక్ష్మి పథకం అమలు ద్వారా ఆటో కార్మికులు నష్టపోతున్నందున వారికి కూడా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఉపాధి అవకాశాలు చూపించాలని కోరారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం అయ్యప్ప స్వాములకు కోగంటి సూర్యచంద్,సుష్మ దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో దేవాలయకమిటీ అధ్యక్షులు కామిశెట్టి భాస్కర్, మాజీ అధ్యక్షులు బొబ్బిళ్ల మురళి, డాక్టర్ సుమన్‌కల్యాణ్, తూర్పాటి శంకర్, చింతల సాయిలు, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, తాడూరి పరమేశ్, ఉప్పు అంజనేయులు, పెద్దగోని రమేశ్‌గౌడ్, సుక్క సుదర్శన్, అంతటి రాము, గుత్తికొండ సుధీర్, తొర్పునూరి నాగరాజు, పల్చం రాజేశ్, సంపత్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-మోతే



మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను స్థానిక సర్పంచి మెట్టు అలివేలి నారాయణరెడ్డి గురువారం ప్రారంభించారు. నీటిపారుదల పౌరసర పరాల మంత్రి గతంలో ఎంపీగా ఉండగానే సీసీ రోడ్డు కావాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పురస్కరించుకొని ఐదు లక్షల రోడ్డు పనులు ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దోస పా టీ రాములు, సామ చిన్న వెంకటరెడ్డి ,మాజీ సర్పంచులు బొక్క రామచంద్రారెడ్డి, గురజాల వెంకన్న, ఇంద్ల జయమ్మ ,వెంకటేశ్వర్లు ,వార్డు సభ్యులు బొల్లం నారాయణ, బొడ్డు నరసయ్య, జలగం ఆంజనేయులు, బొడ్డు సాలయ్య ఐతబోయిన వెంకన్న, మాజీ సూర్యాపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ సామ పెద్ద రామిరెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు బొక్క ఉపేందర్ రెడ్డి, సిరికొండ పీఏసీఎస్ డైరెక్టర్ సామ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు తేజ విద్యాలయ విద్యార్థులు

నవతెలంగాణ-కోదాడరూరల్



పట్టణంలోని తేజ విద్యాలయ విద్యార్థులు రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు గురువారం ప్రిన్సిపాల్ రమాదేవి ఓ ప్రకటనలో గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన 9 వ తరగతి విద్యార్థులు గౌతం కృష్ణారెడ్డి , మాడుగుల వివేక్ లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాలల క్రీడా సంస్థ ఆధ్వర్యంలో గురువారం చిట్యాల లోని ప్రభుత్వ జిల్లాపరిషత్తు పాఠశాలల లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించారు. నాలుగు రౌండ్లు గా పోటీలను నిర్వహించారు. అందులో తేజ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనారు. వీరు హైదరాబాద్ లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. విద్యార్థులకు ఎస్ జి ఎఫ్ జిల్లా చెస్ ప్రతినిధులు వాసుదేవరావు, కరుణాకర్ రెడ్డి సర్టిఫికెట్ లు అందించారు అని తెలిపారు. విద్యార్థులను తేజ విద్యాలయ ప్రిన్సిపల్ ఉస్తెల రమాదేవి అభినందించారు.

23న ముక్కోటి ఏకాదశి ఉత్సవం

నవతెలంగాణ-భువనగిరిరూరల్

మండలంలోని వడాయి గూడెం పరిధిలోగల శ్రీ కంచి కామకోటి పీఠం, పంచముఖ అనుమదీశ్వర దేవస్థానం సురేంద్రపురి లో ఈనెల 23వ తేదీ న శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా సురేంద్రపురి దేవాలయంలో వెంకటేశ్వర స్వామి వారికి ఉదయం 5. గంటలకు నిజాభిషేకం, అర్చన.ఉదయం 6 గంటల నుండి ఉత్తర (వైకుంఠ)ద్వార దర్శనం హారతి, ఊరేగింపు జరగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మెన్ కుందా ప్రతిభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు స్వామి వారిని ఉత్తర (వైకుంఠ) ద్వార దర్శనం చేసుకుని తీర్థప్రసాదం తీసుకొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.



భూ సమస్యల పరిష్కరించాలి వినతి

నవతెలంగాణ-నూతనకల్

ఉమ్మడి మండలాలలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తుంగతుర్తి శాసనసభ సభ్యుడు సామెల్ కు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తీగల గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు విన్నపించుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 70 సంవత్సరాల నుండి భూ రికార్డులో కాస్త లో ఉంటున్నప్పటికీ పట్టా కాక ధరణిలో పేరు లేకపోవడంతో అందించే క్రాఫ్ట్ లోన్ లో గాని రైతు బంధు వంటి అనేక రాయితీలను పోతున్నామని అన్నారు కనీసం తాము పండించుకున్న పంటను అమ్ముకోవడానికి కూడా తమకు పట్టాదారి పాసు బుక్కులో భూమి లేకపోవడంతో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంది రైతుల సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు సమస్యలు విన్న శాసనసభ సభ్యుడు సమస్యలను పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తీగల మల్లారెడ్డి, సాబాది వాసుదేవరెడ్డి, ఉమ్మడి మండలాల రైతులు భీమిడి నారాయణ రెడ్డి. యుద్ధం రెడ్డి, ఏలేటి సత్తి రెడ్డి, గుర్రం ఎంకన్న , సొప్పరి ఏసు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డు ఉన్నవారు ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

లేబర్ కార్డు బీటీసీ ఉన్నవారికి సిఎస్సి హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఐ ఎన్ టి యు సి నియోజకవర్గం అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య తెలిపారు గురువారం మండల పరిధిలోని గోపాలపురంలో ఉచిత క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కార్మికులకు ఆరోగ్య శ్రేయస్సు కోసం గ్రామ గ్రామాల్లో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ క్యాంపులలో 52 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగ సైదులు ఆరోగ్య కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మందుల సామేలుకు శుభాకాంక్షలు కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-తిరుమలగిరి



అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి అధిక మెజార్టీతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మందుల సామేలుని తిరుమలగిరి మున్సిపాలిటీ పరిదిలోని మాలిపురం గ్రామానికి చెందిన నాయకులు హైదరాబాదులోని ఎమ్మెల్యే గారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు పోతరాజు శ్రీనివాస్ , పరశురాములు, మహేందర్, సోమ నరసయ్య, సురేష్, శ్రీను మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకున్న కాంగ్రెస్ అభిమాని

నవతెలంగాణ-కోదాడరూరల్



అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఆ పార్టీ వీరాభిమాని గుండు చేయించుకొని మొక్కు చెల్లించుకున్న వార్త సర్వత్ర చర్చనీయాంశముగా మారింది. గురువారం మండల పరిధిలోని టిక్యతండాకు చెందిన గుగులోతు వీరన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, కోదాడ , హుజుర్ నగర్ నుండి ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి లు భారీ మెజారిటీతో గెలిస్తే ఎర్రవరం బాల ఉగ్ర లక్ష్మీనర సింహ స్వామి ఆలయం వద్ద గుండు చేయించుకుంటా నని మొక్కు కున్నాడు. కోరిక నెరవేరడం తో అతను గురువారం ఆలయం వద్ద తన మొక్కులు చెల్లించుకున్నాడూ. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, ఎంపీ ఎలక్షన్ లో కూడా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నాడు.

గుణగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్ర ప్రారంభోత్సవ సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-అర్వపల్లి

సీపీఐ(ఎంబిఎల్) న్యూడెమోక్రసీ నూతనకల్ మండల కార్యాలయాన్ని కామ్రేడ్ గుణగంటి సత్యనారాయణ జ్ఞాపకార్థంగా కుమారుడు కుమార్తె అన్వేష్,సమత లు నిర్మాణం చేశారు. బిల్డింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 17న సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, జిల్లా అధ్యక్షులు పోలేబోయిన కిరణ్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రంలో కామ్రేడ్ గుణగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్ర ప్రారంభోత్సవ సభ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ వ్యవస్థ మార్పు కోసం విద్యావంతుడుగా,ప్రిన్సిపాల్ గా కృషి చేశారని అనేక పేద విద్యార్థులకు తన వంతు సహాయాన్ని అందజేస్తూ విద్యాబుద్ధులు నేర్పడంలో ఎనలేని సేవలు చేశారని అన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమంలో అనేక నిర్బంధాలు కూడా ఎదుర్కొన్నాడన్నారు. కార్యాలయాన్ని ఉద్యమ కేంద్రంగా తీర్చిదిద్దుతూ అనేకమంది ప్రజలకు మార్క్సిస్టు, లెనినిస్ట్ సాహిత్యాన్ని అందుబాటులో ఉంచి భావజాల వ్యాప్తికి కేంద్రంగా ఉపయోగపడుతుందన్నారు. ఈ విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకులు, కడారి సైదులు,వేముల గణేష్, ఏర్పుల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి అధికారిపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు

- అవినీతిపై ఆధారాలు ఉన్న పట్టించుకోని అధికారులు
- కలెక్టర్, ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలి
- పీడీని వెంటనే సస్పెండ్ చేయాలి
- సామాజిక కార్యకర్త కట్ట వెంకటేశం

నవతెలంగాణ నల్గొండ కలెక్టరేట్

గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ నిధులను పక్కదోవ పట్టిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న నల్లగొండ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని ఎం. కాలిందిని పై నల్లగొండ జిల్లా కేంద్రం శాంతినగర్ కు చెందిన సామాజిక కార్యకర్త కట్ట వెంకటేశం ప్రజా దర్బార్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. కాగా ఫిర్యాదు పై త్వరలో విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి గ్రీవెన్స్ సెల్ నుండి గురువారం సామాజిక కార్యకర్త కట్ట వెంకటేశం కు రిప్లై వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఆర్డిఓ పిడి కాలిందిని విధుల నిర్వహణలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ఆరోపణలు ఎదుర్కొంటూ ఉందని తెలిపారు. ఇప్పటికే అవినీతి ఆరోపణలకు సంబంధించిన కథనాలు వివిధ పత్రికలలో ప్రచురిత అయ్యాయని.. ఆధారాలతో సహా లిఖితపూర్వకంగా పై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పిఆర్ అండ్ ఆర్డి ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్, జిల్లా కలెక్టర్, ఎసిబి, సి.బి.ఐ, ఈ డి లకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవని విచారణ కూడా నిర్వహించలేదని ఆరోపించారు. అక్రమంగా డిప్యూటేషన్ పేరుతో జిల్లాకు వచ్చిన పిడి కాళిందిని డిఆర్డిఓ లో తిష్ట వేసి ప్రైవేట్ సంస్థలతో కుమ్మక్కై అవినీతికి పాల్పడుతుందని అన్నారు. ముఖ్యంగా బైరుసన్ సంస్థతో వ్యాపారాలను ఎస్ హెచ్ జి, వివో, ఎంఎస్ సభ్యులతో వ్యాపార సంస్థలను ఏర్పాటు చేస్తామని చెప్పి మహిళా సంఘాల మోసం చేసినట్లు ఆరోపించారు. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల అండదండతో ఇష్ట రాజ్యాంగ వ్యవహరించిందని ఆరోపించారు. జిల్లా మహిళా సమైక్యకు సంబంధించి 14, 72, 576 రూపాయలను తన సొంత ఖాతాలోకి మళ్లించిందని తెలిపారు. విషయంపై సేర్ఫ్ డైరెక్టర్ స్థాయి అధికారి విచారణ చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు.అధికారులు పిడి అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోకపోవడంతో అవినీతిని ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. అవినీతికి సంబంధించి మరింత సమాచార కోసం ఆర్టిఐ ద్వారా కోరినట్లు తెలిపారు. ఇప్పటికైనా విషయంపై రాష్ట్రస్థాయి ఉన్నత అధికారి ని నియమించి విచారణ చేయించాలని తగిన ఆధారాలు ఉన్నందున వెంటనే సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రి తో పాటు జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రోడ్డున పడుతున్న ఆటోకార్మికుల కుటుంబాలు

నవతెలంగాణ-నేరేడుచర్ల

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని, దానివల్ల ఆటో కార్మికుల జీవన ఉపాధి కోల్పోవడం జరుగుతుందని, ఆటోలు నడవక కుటుంబాలు వీధిన పడ్డాయని నేరేడుచర్ల ఆటో యూనియన్ సభ్యులు అన్నారు. కావున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మా మీద దయ ఉంచి ఆటో కార్మికులందరికీ జీవనోపాధి కల్పించాలని,నెలకు 20 వేల రూపాయల జీవనభృతి కల్పించాలని, ప్రమాద బీమా 25 లక్షలు అమలు చేయాలని, ట్రాన్స్పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఇన్సూరెన్స్ ఫిట్నెస్ ఉచితంగా అమలు చేయాలన్నారు. ఆటో కార్మికులందరికీ అడ్డా ఏర్పాటు చేసి, పోలీసుల వేధింపులు అరికట్టాలన్నారు. పై డిమాండ్లన్నీ ప్రభుత్వానికి నివేదించాలని నేరేడుచర్ల ఎంఆర్ఓ కు వినతిపత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో సీఐటీయూ నాయకులు నీలా రామ్మూర్తి, ఎస్కే.ఆఫీస్, పాల్వాయి రమేష్, ఆటో ఓనర్స్ లింగాల శ్రవణ్ ,పల్లెపంగా శాంతయ్య, సంజీవరెడ్డి, ఎస్కె.మీరా, ఎస్కె.ఆజాం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పుస్తకాలు వితరణ

నవతెలంగాణ-హుజూర్‌నగర్



పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కు ఫుడ్ ఫర్ థాట్ స్వచ్ఛంద సంస్థ రూ.50వేల విలువైనటువంటి పుస్తకాలను బహుకరించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మల్ రెడ్డి భీమార్జున్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలను చదవడం వల్ల విద్యార్థులలో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాదని విద్యార్థుల సర్వతో ముఖ అభివృద్ధికి పుస్తక పఠనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల గ్రంథ పాలకులు నాగరాజు మాట్లాడుతూ నేటి విద్యార్థులలో పుస్తక పఠనం తగ్గిపోయిందని పుస్తక పటం వల్ల అపార జ్ఞానాన్ని అర్జించవచ్చని గతంలో ఎంతో మంది మేధావులు పుస్తక పఠనం వల్ల తమ విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు మాధవి శర్మ సమన్వయకర్త కావేరి కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బస్ సౌకర్యం లేని గ్రామాలు ఎన్నో..?

- మహాలక్ష్మి పథకం సద్వినియోగం చేసుకోలేకపోతున్న మహిళలు

నవతెలంగాణ-ఆత్మకూరు(ఎస్)



తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించింది. కానీ మండలంలోని బస్ సౌకర్యం లేని గ్రామాలు చాలా ఉన్నాయి. దేవుడు వరం ఇచ్చినా పూజారి కనికరించలేదు అన్నట్లు ఉన్నది మండల పరిధిలోని మహిళల పరిస్థితి. ఆత్మకూరు ఎస్ మండలంలో తండాలతో కలిపి 30 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆత్మకూరు గ్రామం మేజర్ గ్రామపంచాయతీ గా ఉన్నప్పటికీ కూడా బస్ సౌకర్యం లేదు. కందగట్ల, ఏనుభాముల, ఆత్మకూరు ఎస్, తుమ్మలపెపహడ్,కోటపాడు,శె ట్టిగూడెం ,బొప్పారం, రామన్నగూడెం, ముక్కుడు దేవులపల్లి, ఇస్తాలపురం, పాతర్లపాడు , గట్టికల్ మిగతా తండాలతో కలిపి ఉన్న గ్రామపంచాయతీలకు బస్ సౌకర్యం లేదు. ప్రస్తుతం ఏపూర్, మిద్దనపల్లి, కొత్త గూడెం గ్రామాలకు బస్ ఉదయం ఒక ట్రిప్పు, రాత్రి ఒక ట్రిప్పు మాత్రమే వస్తుంది. ఈ గ్రామాలలో బస్సు సౌకర్యం లేనందున మహాలక్ష్మి పథకాన్ని మహిళలు వినియోగించుకోలేకపోతున్నారు. గ్రామాల నుండి సూర్యాపేట పట్టణానికి ప్రయాణం చేయాలంటే ఆటోలో ప్రయాణం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించినప్పటికీ మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం బస్ సౌకర్యం లేని గ్రామాలకు గుర్తించి బస్ సౌకర్యం ఏర్పాటు, చేసి ట్రిప్పుల సంఖ్యను పెంచాలని మహిళలు కోరుతున్నారు.

ట్రిప్పుల సంఖ్యను పెంచాలి

అవిరే పద్మ,ఉప సర్పంచ్ ఏపూరు



ఆత్మకూర్ ఎస్ మండలంలోని ఏపూరు మిడతనపల్లి కొత్తగూడెం గ్రామాలకు బస్సు ఉదయం ఒక ట్రిప్పు, రాత్రి ఒక ట్రిప్పు మాత్రమే వస్తుంది. దీనికి మూలంగా ప్రజలు ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం హర్షనీయం అయినప్పటికీ ట్రిప్పుల సంఖ్యను పెంచకపోవడం మూలంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోలేకపోతున్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ట్రిప్పుల సంఖ్యను పెంచాలి.

మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత కాంగ్రెస్‌దే

నవతెలంగాణ-బొమ్మలరామారం



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మహిళ సంక్షేమానికి పెద్దపీటం వేస్తోందని హాజీపూర్ సర్పంచ్ తిరుమల కవిత వెంకటేష్ గౌడ అన్నారు.గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికాంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం,10 లక్షల రూపాయలకు ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన గ్యారెంటీ పథకాలను వందరోజుల్లో పూర్తిస్థాయిలో అమలు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జిట్టా బాలకృష్ణ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-భువనగిరిరూరల్



తెలంగాణ ఉధ్యమ నాయకులు ప్రస్తుత బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిట్టా బాల కృష్ణ రెడ్డి జన్మదినం సందర్భంగా వారి వ్యవసాయ క్షేత్రంలో శాలువా తో యాదాద్రి భువనగిరి జిల్లా మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఎండి ఇంతియాజ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ మైనారిటీ నాయకులు అమిర్, అలీ ఆమెర్ లు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ శాతం పెంచాలి

• **బొల్లెపల్లి లక్ష్మణ్ గౌడ్**

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికల నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు బొల్లెపల్లి లక్ష్మణ్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల్లో 23 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీసీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. రిజర్వేషన్ల పెంపు వల్ల మండలి, మున్సిపాలిటీ, పంచాయతీలలో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. రిజర్వేషన్లపై స్పష్టత లేకుండా ఎన్నికలు నిర్వహించొద్దని ప్రభుత్వాన్ని కోరారు.

ఎమ్మెల్యే ఐలయ్యను కలిసిన యూత్ కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ-బొమ్మలరామారం



ఆలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను బొమ్మలరామారం మండలం యూత్ కాంగ్రెస్ నాయకులు గురువారం యాదగిరిగుట్టలో వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దేశెట్టి చంద్రశేఖర్,నరసింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రావణ్ కుమార్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, దయాకర్ రెడ్డి, ముడుగుల కుమార్, గోపికృష్ణ, జమీల్, అమ్ము, ఉపేందర్, శ్రవణ, బాలకృష, కార్యకర్తలు పాల్గొన్నారు.

16 న విద్యుత్ గ్రీవెన్స్ డే

• **ఏడీఈ సీహెచ్.నరేష్ కుమార్ రెడ్డి**

నవతెలంగాణ-రామన్నపేట



విద్యుత్ వినియోగదారుల సమస్యల పై మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యా లయంలో ఈ నెల 16న సీజీ ఆర్‌ఎఫ్ (కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రేసాల్ ఫోరం) హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు స్థానిక ఏడీఈ సీహెచ్. నరేష్ కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యల పరిష్కారానికి హాజరయ్యే వినియోగదారులు ఆధార్ కార్డు, కరెంటు బిల్లు రసీదు తీసుకురావాలని ఆయన తెలిపారు. 16న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. రామన్నపేట సబ్ డివిజన్ పరిధిలోని రామన్నపేట, వలిగొండ మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మోడీ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-భువనగిరి



కేంద్ర ప్రభుత్వ జీడిఎస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మెలో భాగంగా గురువారం తపాలా కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వం, మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు సత్తయ్య మాట్లాడారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల పట్ల నియంతృత్వ వైఖరి అవలంబిస్తూ అధికారులతోటి బెదిరింపులకు దిగడాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించి వారికి కావలసిన రావలసిన సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సత్తయ్య, గంటల వెంకటయ్య, దస్సింగ్, మురళి, సత్యనారాయణ, ఇమ్రాన్, ఉమా రాణి, పద్మ లక్ష్మీ పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగులకు 8 గంటల పని కల్పించాలి

నవతెలంగాణ-చౌటుప్పల్



తపాలా ఉద్యోగులకు 8 గంటల పని కల్పించాలని, అదే విధంగా పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరుచేయాలని తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు ఎమ్‌డి.మసూద్ డిమాండ్‌చేశారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ కేంద్ర నాయకత్వం పిలుపుమేరకు చౌటుప్పల్ సబ్ పోస్టాఫీసు ముందు నిర్వహిస్తున్న సమ్మె గురువారం మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా మసూద్ మాట్లాడుతూ సీనియర్ జీడీఎస్ ఉద్యోగులను 12,24,36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరుచేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలన్నారు. కమలేశ్‌చంద్ర కమిటీ సిఫార్సు చేసిన బంచింగ్ అమలుచేయాలన్నారు. తపాలా ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి నశించాలన్నారు. తమ హక్కుల కోసం న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ సమ్మెలో బిక్కోజి, శ్రీనివాస్, కాశయ్య, రామస్వామి, చిరంజీవి, పాండునాయక్, పాపిరెడ్డి, కిషన్‌రావు పాల్గొన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌ని ఉద్దేశించి మాట్లాడిన బీర్ల

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో, రాజకీయ పార్టీల సహకారంతో



ఏర్పాటైన నూతన అసెంబ్లీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ గురువారం ఎంపిక కావడంతో, అసెంబ్లీలో ఆలేరు శాసనసభ్యులు, బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఆలేరు ప్రజల పక్షాన శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని, ఎన్ఎస్యు ఐ విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పనిచేశారని, మూడవ శాసనసభకు ఏకగ్రీవంగా స్పీకర్గా ఎన్నికైన బడుగు బలహీన వర్గాల నేత అని ధన్యవాదాలు తెలియజేస్తూ కొనియాడారు. శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు మీకు మెండుగా ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు సోనియా గాంధీ ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలు వాగ్దానాలు అమలు జరిగేలా, గడపగడపకు చేరేలా బాధ్యతాయుతంగా పనిచేస్తామని సభాముఖంగా చెప్పారు. స్పీకర్ ఎన్నికకు సహకరించిన అన్ని పక్షాల శాసనసభ్యులకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన ఎమ్మెల్యేల సన్మానోత్సవ కార్యక్రమానికి జయప్రదం చేయండి

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్



గిరిజన విద్యార్థి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణలో గెలిచిన గిరిజన ఎమ్మెల్యేలను ఆత్మీయ సన్మానోత్సవ కార్యక్రమం నేడు హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉదయం 10.00 గంటలకు జరుగుతుందని గిరిజన శక్తి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కరంటోతు నరేందర్ నాయక్ గురువారం తెలిపారు.ఈ ఆత్మీయ సన్మానోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుంచి గిరిజన విద్యార్థి మరియు ప్రజా ఉద్యోగ సంఘాల నాయకులు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని కరంటోతు నరేందర్ నాయక్ పిలుపునిచ్చారు.

అయ్యప్ప దేవాలయ స్లాబ్ పనుల ప్రారంభం

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు పట్టణంలో హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ స్లాబ్ (ఆర్ ఎంసీ) నిర్మాణాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మెన్, టెస్కాబ్ వైస్ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపల చైర్మెన్‌వస్పరి శంకరయ్య, బిఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్, కౌన్సిలర్ బేతి రాములు, జిల్లా గ్రంధాల డైరెక్టర్ ఆడెపు బాలస్వామి, ఆలేరు పట్టణ మాజీ అధ్యక్షుడు మొరిగాడి వెంకటేష్,పడిగల రాజు, జిల్లా ఆర్టిఏ మెంబెర్ పంతం కృష్ణ, మొర్తాల రమణారెడ్డి, ఆలేరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు పత్తి వెంకటేష్, పాశి కంటి శీను, మాజీ సర్పంచ్ దాసి సంతోష్, డాక్టర్ మురహరి, పట్టణ ప్రధాన కార్యదర్శి దయ్యాల సంపత్, మహేంద్ర యువజన అధ్యక్షుడు జూకాంటి వెంకటేష్, బిఆర్‌ఎస్ పట్టణ యూత్ బింగి గణేష్, టింకు, హరిహర పుత్ర అయ్యప్ప సేవా సమితి సభ్యులు వెలుగల చంద్రమౌళి, సరాబు లక్ష్మణ్, మంగళగిరి రాజు, దూడల యాదగిరి, పాల్గొన్నారు.



అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాలకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్

నవతెలంగాణ-భువనగిరిరూరల్

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలో స్థానిక భువనగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సాధించారు. పురుషుల 100 మీటర్లు, 200 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, షాట్ పుట్ , జావెలిన్ త్రో లో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. జావలిన్ త్రో, డిస్కస్త్రోలో సిల్వర్ మెడల్స్ బాలికల విభాగంలో లాంగ్ జంప్ లో సిల్వర్ మెడల్, హై జంప్, 100 మీటర్ల పరుగు పందెంలో 2 బ్రౌన్జ్ మెడల్స్ సాధించి పూర్తి పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్షిప్ బాయ్స్ విభాగంలో సాధించడం గర్వ కారణంగా ఉందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రమేశ్ అన్నారు. వారి విజయానికి ప్రాతినిధ్యం వహించిన వ్యాయామ అధ్యాపకులు బి. పాండురంగంకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులను , వ్యాయామ అధ్యాపకుని అభినందించారు. జి స్నేహలత, పీ బాల్ రెడ్డి, కృష్ణయ్య, సుధా, ఎస్ శశికిరణ్, కార్తీక్ దాసరిలు క్రీడాకారులను అభినందించారు.

ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్

• **బోయ రాములు**

నవతెలంగాణ-రామన్నపేట



2004 సంవత్సరం నుండి నియామకమైన ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోయ రాములు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో సంగం మండల అధ్యక్షులు కట్ట మల్లయ్య అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంను విజయవంతం చేయాలనే అని కోరారు. నూతనంగా భాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా ఉపాధ్యాయులకు మంచి పిఆర్‌సీ ప్రకటించలని ఆయన కోరారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రంలో ఈ నెల 17న నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంపెల్లి బిక్షపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానం విజయ్ కుమార్ హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండల మండల ప్రధాన కార్యదర్శి జనపాల కిషన్, నాయకులు స్వామి, నర్సింహా, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆలేరుటౌన్



రాష్ట్ర రోడ్డు భవనాల శాఖామంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ని ఆలేరు కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాదులో ఆయన చాంబర్ వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంత్రి పదవి బాధ్యతలు చేపట్టిన ఆయనకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నీలం వెంకటస్వామి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, నాయకులు కొండరాజు వెంకటేశ్వరరాజు, తుంగ కుమార్ తదితరులు వున్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన ర్యాలీ

నవతెలంగాణ-రామన్నపేట



ఏఐజిడిఎస్ యూనియన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా మూడవరోజు గురువారం మండల కేంద్రంలో రామన్నపేట, చిట్యాల, నార్కట్ పల్లి మండలాల గ్రామీణ తపాలా ఉద్యోగులు మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పని, పెన్షన్, 5 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్, 12, 24, 36 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన ఉద్యోగుల ఆర్థిక ఉన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎం యాదయ్య, ఉపాధ్యక్షులు జి లింగస్వామి, మతిన్, ప్రభాకర్ చారి, గౌసు, యాదయ్య, కేతనాయక్, శ్రీకాంత్, శివ కిరణ్, శివ ప్రసాద్, సాయి, అరవింద్, రమాదేవి, సునీత, మౌనిక, వాజిద్, హరిప్రసాద్, గోపి, హరీష్, జానీ, సత్యం, స్వప్న, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రులకు యాదాద్రి ప్రసాదం అందజేత

నవతెలంగాణ-రాజాపేట

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహలకు గురువారం రాజాపేటకు చెందిన మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఇంజ నరేష్ యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి అభిషేక లడ్డు ప్రసాదం అందజేసి ప్రత్యేక కండువాతో సత్కరించారు. వారికి కేటాయించబడిన సెక్రటేరియట్ చంబార్ల లో పూజా కార్యక్రమానికి ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇంజ నరేష్ హాజరై వారికి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.



రాజాపేటలో బాలయ్య సంతాప సభ

నవతెలంగాణ-రాజాపేట

రాజాపేట మండల కేంద్రంలోని గాంధీ బొమ్మ చౌరస్తాలో రాజాపేట మాజీ సర్పంచ్ బిజెపి రాష్ట్ర నాయకులు బిళ్ళకుదురు బాలయ్య సంస్మరణ సభ గురువారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్రావు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం, పోతంశెట్టి రవీందర్, బొట్టు అబ్బయ్య , పిట్టల అశోక్, ఉట్కూర్ అశోక్ గౌడ్ ,స్థానిక ఎంపీటీసీ దాచేపల్లి రాజు పాల్గొని ప్రసంగించడం జరిగింది. భారతీయ జనతా పార్టీ మండల పార్టీ అధ్యక్షులు కాయితి బాలరెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. మారుమూల ప్రాంతంలో రాజపేట మండల కేంద్రంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీని విస్తరించడానికి నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడిన వ్యక్తిని బాలయ్య సేవలు కొనియాడారు రెండు నిమిషాలు మౌనం పాటించి బాలయ్య ఆశయాలను నెరవేర్చాలని కార్యకర్తలకు చెప్పడం జరిగింది .ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి గవ్వల సిద్దేశ్వర, నమిలే సర్పంచ్ మేకల మమతా రమేష్, బీజేవైఎం మండల నాయకులు శేఖర్ రెడ్డి, కోయ మధు, బిజెపి మండల నాయకులు శీలం పాపిరెడ్డి, ఎల్లమ్మ, రాంరెడ్డి నవీన్ రెడ్డి, భగవాన్ రెడ్డి, బొంగు నర్సింలు, గాండ్ల నర్సింగరావు, బీరప్ప, వినోద్, జన్మదిన సిద్ధులు పాల్గొన్నారు.

హిందూ ముస్లిం ఐక్యమత్యం చాటిన ఎండి.అక్బర్

నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరి మండలంలోని అనంతారం గ్రామంలో అయ్యప్ప స్వాములకు



అన్నదాన కార్యక్రమాన్ని (బిక్ష) ముస్లిమ్ సోదరుడు ఎండీ అక్బర్ ఉద్దీన్ గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దండ బోయిన బాలరాజ్ యాదవ్, గురు స్వాములు సింగిరెడ్డి సుధా మోహన్ రెడ్డి, సల్ల పాండు, బొబ్బల నరేందర్ రెడ్డి, మొగుళ్ళ భాస్కర్ రెడ్డి, సామల శివ, పల్లేపటి నరేందర్, పబ్బాల నరసింహా, గుమ్ముల ప్రవీణ్, రాపాక నరేష్, కుమార్ , భరత్, శివ, స్వాములు పాల్గొన్నారు.

శ్రీ స్వామి వారిని దర్శించుకున్న న్యాయవాది

నవతెలంగాణ-రాజాపేట

రాజాపేట కు చెందిన సీనియర్ న్యాయవాది, జర్నలిస్టు అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పెంట రమేష్ సుజాత దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద ఆశీర్వచన మంటపంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేసి ప్రసాదం అందజేశారు. వివాహ దినోత్సవం పురస్కరించుకొని శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు న్యాయవాదులు, జర్నలిస్టులు, అన్ని పార్టీల నాయకులు, పెద్దలు, యువకులు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ
4
నల్లగొండ
శుక్రవారం | డిసెంబర్ 15, 2023 | www.navatelangana.com

పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం దంపతులు



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన 22వ మండల పూజ కార్యక్రమానికి. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శోభ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకల్లో గురు స్వామి బెల్లి వెంకన్న, స్థానిక సర్పంచ్ దూదిమెట్ల స్రవంతి, ఎంపిటిసి పాశం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సత్తయ్య, వేముల నరసింహ, కొర్వి శివరాం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ డాక్ సేవకుల నిరవధిక సమ్మె



నవతెలంగాణ-పెద్దవూర

గ్రామీణ డాక్ సేవకుల (జీడిఎస్)కు సంబంధించిన వివిధ సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ ఎఐజీడిఎస్‌యు డిసెంబరు 12 నుండి నిరవధిక సమ్మె చేస్తున్నారు. డాక్ సేవక్‌లకు సివిల్ సర్వెంట్ హెూదా కల్పించి ఎనిమిది గంటల డ్యూటీ, బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేస్తూ పెద్దవూర మండలంలో సబ్ పోస్తాఫీసు ముందు ధర్నాడాక్ సేవకులు గత మూడు రోజులుగా ధర్నా నిర్వహిస్తున్నారు. జీడిఎస్‌లను పర్మినెంట్ చేయాలని పెద్దవూర మండలంలో ధర్నా చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ డాక్ సేవక్ మండల అధ్యక్షులు ఎండి జానిమియా, మల్లేశ్వరి, అనంతశర్మ, శ్రీనివాస్, సమర సింహ్మా రెడ్డి, సందీప్, లోకేష్, సౌజన్య, మాదవి, భానుమతి తదితరులు ఉన్నారు.

ఇరు పక్షాలూ మాట్లాడేందుకు అవకాశమివ్వాలి

- గడ్డం ప్రసాద్‌ను ఏకగ్రీవంగా స్పీకర్‌గా ఎన్నుకోవడం అభినందనీయం
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

నవతెలంగాణ-మునుగోడు

ఎన్నో ఆశలతో ఏర్పరచుకున్న తెలంగాణ రాష్ట్రంలో సమస్యలపై సభ్యులు మాట్లాడేటప్పుడు ఆంక్షలు విధించకుండా అధికారపక్షం ప్రతిపక్షం అని తేడా లేకుండా సభ్యుల సమస్యలతో పాటు నియోజకవర్గ, రాష్ట్రంలోని ప్రజల సమస్యలపై మాట్లాడేందుకు అవసరమైన సమయం ఇవ్వాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గురువారం అసెంబ్లీలో నూతనంగా స్పీకర్ బాధ్యతలు స్వీకరించిన గడ్డం ప్రసాద్‌ను కోరారు. ఈ సందర్భంగా



రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మూడోసారి జరిగిన ఎన్నికలలో ఏకగ్రీవంగా స్పీకర్గా ఎన్నుకోవడం అభినందనీయమని అని అన్నారు. కష్టపడి పైకి వచ్చిన తమకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొస్తే ఉన్నతమైన పదవి వస్తదని ఆశించాను కానీ అంతకుమించి గౌరవపదమైన పదవి రావడం చాలా ఆనందం కలిగిందని అన్నారు. ప్రతిపక్ష సభ్యులు సభలో మాట్లాడేటప్పుడు సమయం కావాలని కోరుతుండడంతో రాజగోపాల్ రెడ్డి గత అసెంబ్లీలో మూడున్నర సంవత్సరాలు తను అనుభవించిన జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలోని సమస్యలను రాష్ట్రంలోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చేందుకు మాట్లాడుతుంటే సభ్యుల సంఖ్య ప్రమాణంగా నిమిషం నిమిషం లెక్కపెట్టుకుంటూ మాట మాటకు అడుగు అడుగున అడ్డంకులు ఉండేవి అధ్యక్ష అని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఐదు సంవత్సరాలు అధ్యక్ష పదవి రాష్ట్రంలోని సమస్యల పైన మాట్లాడేందుకు అధికారపక్షం ప్రతిపక్షం అనే వివక్ష లేకుండా స్పీకర్ పదవికి వన్నె తెచ్చే విధంగా నడుచుకోవాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులకు సమయపాలన ఉండదా ?

- ఎప్పుడొస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని వైనం

నవతెలంగాణ-చింతపల్లి

అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్న చందంగా గ్రామస్థాయిలో ఆధార్ కార్డు పై సంతకం కావాలన్నా, పెన్షన్ గురించి సంతకం కావాలన్నా, కావాలన్నా, ఇల్లు కట్టుకొనుటకు నల్లా పర్మిషన్ కావాలన్నా, కరెంటు డిడి గురించి సంతకం కావాలన్నా పంచాయతీ కార్యదర్శుల సంతకం అవసరం. కానీ చింతపల్లి మండలంలో మొత్తం 34 గ్రామపంచాయతీలు ఉన్నప్పటికీ 34 మంది పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నప్పటికీ ఆయా గ్రామ పంచాయతీ యొక్క పంచాయతీ కార్యదర్శులు మాత్రం గ్రామపంచాయతీ నియమ నిబంధనల మేరకు పనిచేయటం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కలెక్టర్ సైతం ఆఫీసుకు వచ్చిన తర్వాతనే ఎక్కడైనా ప్రోగ్రామ్ ఉంటే అక్కడికి వెళ్తారని, కిందిస్థాయి ఉద్యోగులు గ్రామస్థాయి కార్యదర్శులు మాత్రం కలెక్టర్ ఆదేశాలు బేకాతర్ చేస్తున్నారని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి స్థానికంగా ఉండి సమస్యలు పరిష్కరించాలి తప్ప, హైదరాబాదులో నివాసం ఉండుకుంటూ ఏదైనా పనికోసం ఫోన్ చేస్తే ఎంపీడీవో కార్యాలయంలో ఉన్నానని, ఎప్పుడు మీ పనులు చేసుకుంటూ ఉంటే ఆఫీసులో మాకు పనులు ఉండవా ? అని అంటున్నారని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పని ఉంటే చింతపల్లి మండల కేంద్రానికి రావాలని ప్రజలకు సూచిస్తున్నారనివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉదయం 12 గంటలకు వస్తున్నానని చెప్పి, సాయంత్రం మూడు గంటలకు బస్సు ఎక్కి హైదరాబాద్కు వెళ్ళిపోతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేసుకుంటున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులకు సమయపాలన ఉండదా... ఎప్పుడొస్తారో ఎప్పుడు వెళ్ళిపోతారో దిక్కు తోచని స్థితిలో ప్రజలు ఉంటున్నారు. ఇది ఇలాగనే కొనసాగితే ప్రజలకు జవాబు దారిగా ఉన్నటువంటి అధికారులు మాత్రం అంటి ముట్టినట్టుగా ఉంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నేను ఓడిపోలేదు..



- ఆధిపత్య వర్గాల, ప్రత్యర్థుల దుష్ప్రచారం నష్టం కలిగించింది
- పంచాయతీ ఎన్నికలకు సిద్దంకమ్మని క్యాడర్‌కు పిలుపు
- పిల్లి రామరాజు యాదవ్

నవతెలంగాణ-నల్లగొండ టౌన్

నేను బరిలో నిలిచిన నాటి నుండి నాకు వెన్నుదన్నుగా నిలిచిన కార్యకర్తలకు,ఓటర్లకు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నియోజకవర్గ ఇంచార్జి పిల్లి రామరాజు యాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం నల్లగొండ పట్టణంలోని జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నల్లగొండ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యచరణ పై చర్చించారు. ఈ సమావేశానికి 1500 మంది ముఖ్య కార్యకర్తలు హాజరైనారు.ఈ సమావేశంలో వివిధ గ్రామాల నుండి,వార్డ్ ల నుండి వచ్చిన ముఖ్య నాయకులు తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

అనంతరం పిల్లిరామరాజు యాదవ్ మాట్లాడుతూ నేను పోటిలో ఉంటానని ప్రచారం మొదలు పెట్టిన నాటి నుండి నా ప్రత్యర్థులైన ఇద్దరు నేను లొంగిపోతున్నాననే ఒక దుష్ప్రచారాన్ని మొదలు పెట్టి ప్రజల ఆలోచనను దారి మళ్లించినరన్నారు.ఆ దుష్ప్రచారాన్ని శాయశక్తులా తిప్పికొడుతునే వచ్చినాం.కాని వారి దుష్ప్రచారాన్ని, ఆర్థిక లాబీయింగ్ ను బలంగా ఎదుర్కొనలేక పోయనమనే నిర్ణయానికి వచ్చినామన్నారు. మాకు అండగా గ్రామాలలో,వార్డ్ లలో కౌన్సిలర్లు,సర్పంచ్ లాంటి ప్రజాప్రతినిధులు లేకపోవడం కూడా కొంత నష్టాన్ని కలిగించిందన్నారు.ఐనా ప్రత్యర్థులకు బలమైన పోటిని ఇచ్చినామన్నారు.కాబట్టి ప్రతి గ్రామంలో సర్పంచ్ లను,వార్డు మెంబర్ లను పోటీ లో నిలబెట్టి గెలిపించుకుంటానని కార్యకర్తలకు హామీ ఇచ్చారు.

సబ్బండ వర్గాల ప్రతినిధిగా పెద్ద లక్ష్యం పెట్టుకొని ప్రజలలోకి పోయినాని వారన్నారు. ప్రజల నుండి అద్భుతమైన సహకారం అందినదన్నారు. అనేకమంది నుండి వృద్ధులు నుండి మొదలుకొని ఉద్యోగస్థులతో పాటు చిన్న పిల్లలు సైతం పుట్టినరోజు కోసం దాచుకున్న డబ్బులను ఎన్నికల ఖర్చుల కోసం ఆర్థిక సహకారం అందించినరన్నారు. ఆ సహకారం వెలకట్టలేనంత విలువైనది అన్నారు.వంధలాదిమంది ప్రత్యక్షంగానో,పరోక్షంగా నో వెన్నుతట్టి ప్రోత్సహించినరు,ధైర్యాన్ని ఇచ్చినరు,మేము ఉన్నామనే భరోసా ఇచ్చినరన్నారు.ఇదంతా నాకు కొండంత బలాన్ని ఇచ్చినదన్నారు.

నేను ఆర్థికంగా కొంత నష్టపోయి ఉండవచ్చు కాని బహుజన భావజాలం బలపడి బడుగు బలహీన వర్గాలలో చైతన్యం పెంచిందన్నారు.మనకంటు బలగం ఏర్పడి మార్పు మొదలైనది అన్నారు.ఈ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికలు నా ఒక్కనికోసం జరిగినవని నేను అనుకోవడం లేదు అన్నారు. నాకొచ్చిన ముప్పై వేయిల ఓట్లు రాష్ట్రంలో అనేకమంది బహుజన వర్గాల నాయకత్వానికి స్ఫూర్తినిచ్చినాయన్నారు. లౌక్యంతో మన బలాన్ని, బలగాన్ని పెంచుకుంధాం అన్నారు.ఎవరు అధైర్యపడకండి మీ కోసమే ఉంటానని భరోసానిచ్చారు.మనం చేసిన పోరాటం గొప్ప పోరాటమన్నారు.

ఓడిపోయినంత మాత్రాన కుంగిపోవాల్సిన అవసరం లేదు.ప్రజలు మనకు ఇచ్చిన బాధ్యత తీసుకొని ప్రజలలోనే నిలబడదాం అన్నారు. ఆరు గ్యారెంటీ లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ను పని చేయించాల్సిన బాధ్యత మన పై ఉన్నదన్నారు.నల్లగొండ నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నవి వాటిని పరిష్కరించడానికి కార్యచరణ ను రుపొందించుకొని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొద్దాం అన్నారు.నేను బతికున్నంత కాలం నల్లగొండ నియోజకవర్గ ప్రజలను సేవ చేయడం కోసమే పని చేస్తానని హమీ ఇస్తునాన్నారు.పంచాయితీ ఎన్నికలు సమీపిస్తున్నవి కాబట్టి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టాలని క్యాడర్ కు సూచించారు. ఏ నిర్ణయం తీసుకున్నా మీ అందరి అభిప్రాయమే శిరోధార్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ,నల్లగొండ జిల్లా జేఏసి చైర్మన్ పందుల సైదులు, నిరుద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ పాల్వాయి రవి,మాజీ కౌన్సిలర్ అంతటి జ్యోతి సమాధానం, అల్లి వేణు యాదవ్, ఎంపిటిసి సత్యవతి సుధాకర్ రెడ్డి, కూతురు జాన్ రెడ్డి, బుచ్చాల నాగరాజు గౌడ్,బొజ్జ పాండు,తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు వేసుకోవాలి : ఏఈఓ వెంకటేష్



నవతెలంగాణ-డిండి

వర్షాబావ ప్రభావం ఎక్కువగా ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని డిండి ఏఈఓ కే వెంకటేష్ రైతులకు సూచించారు. గురువారం డిండి మండలం చెరుకుపల్లి గ్రామంలో వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుతడి పంటలు జొన్న, నువ్వులు, పెసర, మినుములు లాంటి ఆరుతడి పంటలను వేసుకోవాలని అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా పాలెం లో ఆర్ ఏ ఆర్ ఎస్ నందు పచ్చజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు పాలెం వెళ్లి విత్తనాలు తీసుకోవాలని ఆయన సూచించారు. నూతనంగా పట్టేదారు పాస్ పుస్తకం పొందిన రైతులు, గతంలో రైతుబంధు పథకమునకు దరఖాస్తు పెట్టుకున్న రైతులు వారి పట్టేదార పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్ దరఖాస్తు ఫారం తో జరపరచి సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎంజీయూలో చెస్‌పోటీలు, క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఐసిటి అండ్ ఐయుటి జట్ల ఎంపికలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని కళాశాలల విద్యార్థులు నువ్వా నేనా అన్న రీతిలో పోటీపడ్డారు. కాగా గురువారం రోజు జరిగిన చెస్ పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి విశేష స్పందన లభించింది. మహిళా జట్టు 10 పురుషుల జట్లు 12 వచ్చినట్లు ఎంజియూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఉపేందర్ రెడ్డి వెల్లడించారు. ఈ పోటీలను ఎంజియూ ఓఎస్‌డిటు విసి ప్రొఫెసర్ అల్వాల రవి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి డాక్టర్ దోమల రమేష్, స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ఉపేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. అనంతరం స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంజియూ పీడీలు డాక్టర్ మురళి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మరియు ఇతర పీడీలు అధ్యాపకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు: గురువారం ఎంజియూలో విద్యార్థుల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వక్త వెంకట్రావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు వయసు రీత్యా, ఏకాంతం కారణంగా కలిగే చెంచారత్వాలకు దూరంగా ఉంటూ, జీవితంపై స్పష్టత కల్గి, సామాజిక స్పృహను అలవర్చుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్స్ డైరెక్టర్ డా ప్రేమ్ సాగర్, డా లక్ష్మల్ల మధు, డా శ్యాంసుందర్, తదితర అధ్యాపకులు, మహేష్, సుకీర్తన, నిస్సి, హెబ్సిబా, స్టీవెన్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

నవతెలంగాణ-నల్లగొండ టౌన్

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన గురువారం నల్లగొండ మండలంలోని చర్ల పల్లి సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై కంచర్ల భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ పరిధిలోని 12 బెటాలియన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న శ్రీకాంత్(40) విధులు నిర్వహించి నల్లగొండకు వస్తున్న క్రమములో చర్ల పల్లి సమీపంలో వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని కారు ఢీకొనడంతో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడికి భార్య ఓ పాప ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



కస్తూర్బా విద్యాలయంలో సమగ్ర పరిశీలన

నవతెలంగాణ-పెద్దఅడిశర్లపల్లి

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా గురుకుల విద్యాలయంలో గురువారం తొమ్మిది మంది సభ్యులతో కూడిన సమగ్ర పరిశీలన బృందం విద్యాలయంలో చదువుతున్న బాలికలకు బోధన, పరిశుభ్రత, భోజనం, వారి యొక్క ప్రవర్తన, పాఠశాల యొక్క రికార్డుల నమోదు, అధ్యాపకుల బోధనపై పరిశీలన చేసిన బృందం అధ్యక్షుడు శ్రీనివాస్, బాలికలను అధ్యాపకులను విద్యాలయానికి సంబంధించిన విషయాలు అడిగి తెలుసుకుని నిబంధనల ప్రకారమే ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జె శ్రీనివాస్,కేజీబీవీ ప్రత్యేక అధికారిణి సరళ, టీం సభ్యులు,ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-చిట్యాలటౌన్

ఉమ్మడి నల్లగొండ జిల్లా 67వ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్-17 బాల, బాలికలకు చెస్ పోటీలు చిట్యాల పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చిట్యాల లోని పాఠశాలకు ఎంతో చరిత్ర ఉంది ఈ పాఠశాలలో చదివిన విద్యార్థు లు చాలామంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. జిల్లా స్థాయి చెస్ పోటీలకు మన పాఠశాల ఆతిథ్యం ఇవ్వడం గొప్ప విషయమని అన్నారు. ఈ పాఠశాలలో స్కావెంజర్ ని రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్ దుర్గా రెడ్డి ,నల్గొండ జిల్లా క్రీడల కార్యదర్శి వాసుదేవరావు, ఎస్ఎంసి చైర్మన్ పోలేపల్లి సత్యనారాయణ ,పిఆర్టియు జిల్లా కార్యదర్శి బాదం బిక్షపతి ,పీ ఆర్ టి యు చిట్యాల మండల అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, శరత్ ,స్లీవమ్మ, మాధవి, రాధిక, రేవతి పిఈటిలు మోహన్ రెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గం



నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలే ఏకైక మార్గమని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. గురువారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో పోతుగంటి కాశి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందుత్వ కార్డును ఉపయోగించి ప్రజల మధ్య చిచ్చు పెట్టి ఇటీవల బీజేపీ పార్టీ మూడు రాష్ట్రాల్లో విజయం సాధించిందన్నారు. పార్లమెంట్‌లో భద్రత లోపం వల్లనే దాడి జరిగిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని పుణికి పుచ్చుకున్న ఈ గడ్డపై వామపక్ష సామాజిక శక్తులు ఐక్యం కావాలని, అందుకు ఎంసీపీఐయు నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య, వస్కుల సైదమ్మ, గోపి, మోహన్‌నాయక్, గడ్డి వీరయ్య, జ్యోతి, గోపాల్‌దాస్, సుకన్య, వైదులు తదితరులు పాల్గొన్నారు.

సైనిక పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

విద్యా సంవత్సరం 2024-25 కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక పాఠశాలలో 6 వ తరగతి, 9 వ తరగతులలో ప్రవేశానికై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటనను వెలువరించిందని జిల్లా కలెక్టర్ ఆర్.వి కర్ణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతిలో బాల బాలికల ప్రవేశం కొరకు 10 నుండి 12 సంవత్సరాల వయసు 31 మర్చి 2024 వరకు ఉండి 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 9వ తరగతిలో బాలబాలికల ప్రవేశం కొరకు 13 నుండి 15 సంవత్సరాల వయసు 31 మర్చి 2024 వరకు ఉండి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. జనరల్, ఎక్స్ సర్వీస్ మెన్, రక్షణ దళాల్లో పని చేయువారు, ఓబిసి విద్యార్థుల ప్రవేశ పరీక్ష ఫీజు 650 రూపాయలుగా, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 500 రూపాయలుగా నిర్ణయించారని తెలిపారు. exams.nta.ac.in అనే వెబ్ సైటు ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు సమర్పించాలని డిసెంబర్ 16వ తేదీ వరకు ఫీజు కట్టేందుకు గొడువు ఉందని పేర్కొన్నారు. ప్రవేశపరీక్ష 21 జనవరి 2024 ఆదివారం రోజున ఓఎంఆర్ పద్ధతి ద్వారా నిర్వహించబడుతుందని, మరిన్ని వివరాలకై www.nta.ac.in లేదా exams.nta.ac.in/AISSEE అనే వెబ్సైటును సందర్శించాలని తెలిపారు.

అంజద్‌కు ఘనంగా నివాళులు



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

గిరిజన సంక్షేమ శాఖలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తూ గత నవంబర్ 19వ తేదీన మరణించిన అంజద్ కు సంక్షేమ శాఖ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది గురువారం కలెక్టరేట్లోని బిసి వెల్ఫేర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి ఎల్. శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అధికారి కాజా నజీమ్ అలీ అఫ్జల్, సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, డిఐ. రాజు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి



నవతెలంగాణ-చండూరు

తెలంగాణలో మాదిగలకు జనాభా ప్రాతిపదికన 12 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే ఏకైక డిమాండ్‌తో మాదిగ జేఏసి వ్యవస్థాపకులు తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వంలో చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడికి పిలుపు మేరకు గురువారం చండూరు సెంటర్లో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు కురుపాటి సుదర్శన్, సంఘ నాయకులు సంబంధిత కరపత్రంవిడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 18వ తారీఖున దేశ రాజధాని నడిబొడ్డు జంతర్‌లో మహాధర్నా, 19వ తారీఖున పార్లమెంట్ ముట్టడి చేపడుతున్నామని తెలిపారు. ఈ పార్లమెంటు సమావేశాలలో వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని సుదర్శన్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఇరిగి గురునాథ్, తలారి పరమేష్,బొడ్డు యాదయ్య,మాదిగ సర్పంచుల ఫోరం జిల్లా నాయకులు కరుణశ్రీ రవీందర్, తలారి శ్రీకాంత్, సాగర్, కొమ్ము గణేష్, దాసరి రవితేజ పాల్గొన్నారు.

రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి



నవతెలంగాణ-నాంపల్లి

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రివర్గంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని నాంపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము బిక్షం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. అత్యంత వెనుకబడిన మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే, త్వరితగతిన ఇక్కడ మొదలుపెట్టిన ప్రాజెక్టులు పూర్తి కావాలంటే రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంత సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న రాజగోపాల్ రెడ్డి అని ఆయనకు మంత్రి పదవి ఇస్తే మునుగోడు నియోజకవర్గం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గిరిజన ఎమ్మెల్యేలకు రేపు ఆత్మీయ సత్కారం



నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

ఈ నెల 16న పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో గిరిజన శక్తి ఆధ్వర్యంలో గిరిజన ఎమ్మెల్యేలకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గిరిజన శక్తి నియోజకవర్గ అధ్యక్షుడు ధీరావత్ లింగనాయక్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ఎమ్మెల్యేల సన్మాన కార్యక్రమానికి ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు, గిరిజన నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రతాప్‌సింగ్, హన్మంతునాయక్స్, వెంకన్ననాయక్, మౌలాల్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నల్లగొండ రీజియన్
శుక్రవారం | డిసెంబర్ 15, 2023 | www.navatelangana.com

పాలకీడులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-పాలకీడు

మండలంలో జిల్లా కలెక్టర్ వెంకట్ రావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భగా అంగన్వాడి స్కూల్స్ గ్రామపంచాయతీ, శానిటేషన్, మీసేవ కేంద్రాలను తనిఖీ చేశారు, సర్వీస్ డెలివరీ మెకానిసమ్,ఎలా ఉంది అనేది అడిగి వివరాలు తెలుసుకున్నారు, అన్ని కార్యాలయంలో సిబ్బంది హాజరును తనిఖీ చేశారు, గైర్హాజరుకు చెప్పిన కారణాలను పరిశీలించి, సరైనదా కాదా అని ఆరా తీశారు, గ్రామస్థాయిలో సర్వీస్ గురించి ఆరా తీశారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పల్లె దావఖనను, పరిశీలించారు.అనంతరం జాన్ పహాడ్ దర్గాలో కలెక్టర్ పూజలు నిర్వహించారు.అయన వెంట పాలక వీడు తహశీల్దార్లు శ్రీదేవి,ఎంపిడిఓ వెంకట చారి,ఎంపీపీ గోపాల్ నాయక్, ఎంపివో రాజు,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు సన్మానం



నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పురపాలక సంఘం లోని కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలు గురువారం ఆలేరు ఎమ్మెల్యే, బీర్ల ఐలయ్యను ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎమ్మెల్యేగా అత్యధికంగా 50 వేల మెజార్టీతో గెలుపొందిన అందుగ్గాను అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. ఖడ్గాన్ని బహుకరించారు. ఆలేరు పట్టణం అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుత్త శమంత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సభ్యులు బెదర కోట రమేష్, మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సబ్సిడీ గొర్రెలేవి..?



- రెండవ విడత సబ్సిడీ గొర్రెల పంపిణీ కోసం గొల్ల కురుమల ఎదురుచూపులు
- అప్పులు తెచ్చి డీడీలు చెల్లించిన వైనం
- ఏ ప్రభుత్వం మాకు న్యాయం చేస్తుందో! అన్న సందిగ్ధంతో గొల్ల కురుమలు
- డీడీలు చెల్లించి 8 నెలలు దాటిన నేటికీ ఎదురుచూపులే

నవతెలంగాణ-తుంగతుర్తి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చింది.ఇందులో భాగంగా గొల్ల కురుమల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుందని ప్రభుత్వం సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం ప్రవేశపెట్టింది కానీ, లబ్దిదారులకు నిరీక్షణ తప్పడం లేదు. 2017లో ఎంతో ఆర్భాటంగా ప్రభుత్వం పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.మొదటి విడత గొర్రెల పంపిణీలో హడావుడి చేసి రెండో విడత ఎదురుచూపులను మిగిల్చిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గొల్ల కురుమలకు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ గొర్రెలు జాడ లేకుండా పోయాయి.సబ్సిడీ గొర్రెల యూనిట్ కోసం ఒక్కో లబ్దిదారుడు రూ.43,750 డిడి చెల్లించి 8 నెలలుగా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ తో గొర్రెల పంపిణీ ఆగిందని ఎన్నికల అనంతరం యథావిధిగా కొనసాగుతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పలువురు నాయకులు లబ్దిదారులకు చెప్పారు.

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 3,185 మంది డీడీలు చెల్లించగా 976 మందికి గొర్రెల పంపిణీ చేయడం జరిగింది. 2209 మంది డీడీలు చెల్లించి గొర్రెల పంపిణీ కోసం ఎదురుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో గొర్రెల పంపిణీ జరుగుతుందా లేదా చెల్లించిన డీడీ డబ్బులు అయినా తిరిగి ఇస్తారా అనే సందిగ్ధంలో పలువురు గొల్ల కురుమలు ఉన్నారు. లబ్దిదారులు అందిన చోటల్లా అప్పులు తెచ్చి ప్రభుత్వానికి డీడీ రూపంలో చెల్లించి నెలలు గడుస్తున్నా యూనిట్ల జాడ లేకపోవడంతో గొల్ల కురుమలు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు.

ఒక్కో యూనిట్ కు రూ.1.75 లక్షలు

జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అందజేసే సబ్సిడీ గొర్రెలు ఒక్కో యూనిట్ కు ప్రభుత్వం రూ.1,75,000 గా నిర్ణయించింది. వీటిలో లబ్దిదారుడి వాటా కింద రూ.43,750 చెల్లించగా, మిగతా రూ.1,31,250 లను ప్రభుత్వం భరించి లబ్దిదారులకు అందజేసేందుకు విధివిధానాలను రూపొందించింది.అయితే వీటి మొత్తం యూనిట్ విలువ నుంచి రూ.1,58,000 గొర్రెల కొనుగోలుకు కేటాయించగా, మిగతా 17వేలను గొర్రెల రవాణా ఖర్చులు, ఇన్సూరెన్స్, మెడికల్ కిట్లు, ఫీడింగ్ ఖర్చులకోసం కేటాయిస్తుంది.

976 యూనిట్లు మాత్రమే పంపిణీ

జిల్లాలో మొత్తం 3,185 మంది డీడీల రూపంలో రూ.13,93,43,750 చెల్లించారు. అయితే వీరిలో ఇప్పటివరకు కేవలం 976 యూనిట్లు పంపిణీ కావడం విశేషం. ఎన్నికల సమయంలో గొర్రెల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని లబ్దిదారులు డిమాండ్ చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించి నోటిఫికేషన్ వరకు జరిపిందని లబ్దిదారులు వాపోతున్నారు, ఎలాగైనా తమకు న్యాయం చేయాలని అప్పులు తెచ్చి డీడీలు చెల్లించామని లబ్దిదారులు వేడుకుంటున్నారు.



జటంగి పరమేష్ లబ్దిదారుడు గానుగుబండ గ్రామం తుంగతుర్తి మండలం

సబ్సిడీ గొర్రెల కోసం అధికారులు డీడీతీసి పంపమని అప్పటికప్పుడు సమాచారం ఇవ్వడంతో డబ్బుల కోసం తిరిగి అప్పులు చేసిడీడీ చెల్లించాం. డీడీ చెల్లించిన వెంటనే గొర్రెలు వస్తాయని అధికారులు చెబితే ఎంతో ఆశపడ్డాం. కానీ, 8 నెలలు దాటిన గొర్రెల జాడే లేకుండా పోయింది. ఎన్నికలు వచ్చి క్రొత్త ప్రభుత్వం వచ్చింది. ఏ ప్రభుత్వాన్ని అడగాలి, ఎవరిని అడగాలి ,అసలు వస్తాయా రావా అన్న సందిగ్ధంలో ఉన్నాం. అధికారులు స్పందించి గొర్రెల పంపిణీ చేయాలని లేని పక్షంలో కనీసం తమ డబ్బులైన తమకు వచ్చేలా చూడాలని విన్నవించుకుంటున్నారు.

2209 మందికి పంపిణీ జరగాలి

జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు వివరణ

రెండవ విడత గొర్రెల పంపిణీకి సంబంధించిన ఎలాంటి వివరాలు ఇంకా తమకు తెలియలేదని జిల్లా వ్యాప్తంగా 3,185 మంది డీడీలు చెల్లించారని ,976 మందికి మాత్రమే గొర్రెల పంపిణీ చేయడం జరిగిందని,

సర్పంచ్ ఎన్నికల్లో బీఎస్పీ పోటీ

- బీఎస్పీ మండల అధ్యక్షులు తగరం సుభాష్ చంద్రబోస్



నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్

చౌటుప్పల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో బీఎస్పీ పార్టీ తరఫున సర్పంచ్ మరియు వార్డు మెంబర్లుగా పోటీ చేస్తారని చౌటుప్పల్ మండల బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు తగరం సుభాష్ చంద్రబోస్ తెలిపారు.చౌటుప్పల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలల కంటే చౌటుప్పల్ మండలం వ్యాప్తంగా బహుజన్ సమాజ్ పార్టీ బలోపేతం అయిందని అన్నారు.భవిష్యత్తులో బహుజన్ సమాజ్ పార్టీ బలోపేతం కోసం ప్రజల పక్షాన డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామన్నారు.బహుజనులకు సామాజిక న్యాయం అందడమే ముఖ్య ఉద్దేశమన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఈవోకు వినతి



నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలని,సమయ పాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు దొంతగోని అమరేందర్ గురువారం మండల కేంద్రంలో డీఈఓ నారాయణరెడ్డి కి వినతిపత్రం అందజేశారు.మండల వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో సమస్యలను వివరించారు. పూర్తి కాలం ఎంఈఓను నియమించాలని కోరారు. పర్యవేక్షణ అధికారులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలన్నారు.విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరారు. ముఖ్యంగా గిరిజన తండాలోని ఉపాధ్యాయులపై నిఘా పెంచాలన్నారు. పాఠశాలల మూతపడకుండా రక్షించాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేటట్లు చూడాలన్నారు.

పురుగుల మందు తాగిన భార్యాభర్తలు.. భర్త మృతి

నవతెలంగాణ-అర్వపల్లి



ఫైల్ ఫొటో..

కుటుంబకలహాలతో భార్యభర్త గొడవపడి పురుగుల మందుతాగారు. భర్త పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం మండల పరిధిలోనికొమ్మాల గ్రామంలో చోటుచేసుకుంది. అరవపల్లి ఎస్సై అంజిరెడ్డి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... కొమ్మాల గ్రామానికి చెందిన బాషోపలు నవీం(35) అతని భార్య నిర్మల మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. బుధవారం పొలం వద్ద పనులు చేసుకుంటున్న భార్యాభర్తలు మరో మారు ఇరువురు మధ్య సంఘర్షణ జరిగింది. ఆ గొడవ వల్ల మనస్తాపానికి గురైనా భార్యనిర్మల పురుగుల మందు తాగగా, కొంత సేపటికి నవీన్ కూడా గడ్డి మందు తాగటం తో స్థానికులు వారిరువురిని చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.యశోధా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న నవీన్ మృతి చెందాడు . మృతునికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ప్రస్తుత నిర్మలా సూర్యపేటలో ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నది. మృతుని తండ్రి బాషోపలు వీర స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అర్వపల్లి ఎస్ఐ అంజి రెడ్డి తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- తాడు కట్టే సమయంలో క్రెన్ డ్రైవర్ మధ్యలో ఇరుక్కొని మృతి
- టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదమంటూ ఆరోపణ



నవతెలంగాణ-పెద్దవూర

టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆగివున్న టిప్పర్‌ను వెనుక నుంచి ఆర్టీసి బస్ ఢీ కొట్టిన సంఘటలో ముగ్గురికి గాయాలు కాగా క్రెన్‌ల సహాయంతో వాహనాలను తీస్తుండగా క్రెన్ డ్రైవర్ కింద పడి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి పెద్దవూర మండలం నాగార్జున సాగర్- హైదరాబాద్ జాతీయ రహదారి పై తుంగతుర్తి స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ అజ్మీర రమేష్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి 12 గంటల సమయం లో మాచర్ల డిపో కు చెందిన ఏపి 07-జెడ్ -0580 నంబర్ గల సూపర్ లగ్జరీ బస్సు డ్రైవర్, 37 మంది ప్రయానికులను తీసుకొని హైదరాబాద్ కు వెళ్తుండగా రాత్రి 12.00 గంటల సమయంలో పెద్దవూర మండల పరిధిలో తుంగతుర్తి గ్రామం స్టేజి వద్ద టిప్పర్ లారీ బ్రేక్ డౌన్ అవడం వల్ల లారీ డ్రైవర్ టిప్పర్ ను నిర్లక్ష్యంగా రోడ్డు దించకుండా పార్క్ చేసి వెళ్ళిపోయాడు. అది గమనించని ఆర్టీసి బస్సు డ్రైవర్ ఆగివున్న టిప్పర్ ను వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బస్ డ్రైవర్ తో పాటు మరో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయినాయి. ఆసమయం లో ఢీ కొట్టు కున్న బస్సును, టిప్పర్ను రెండు క్రెన్ ల సహాయం తో తీస్తుండగా అందులో ఒక క్రైన్ డ్రైవర్ బీహార్ కు చెందిన విజయకుమార్ చౌరస్య (40) టిప్పర్ లారీకి తాళ్ళు కడుతుండగా ప్రమాదవ శాత్తు అతడు క్రెన్ మధ్యలో ఇరుక్కొని పోయి అక్కడికక్కడే మృతి చెందారు.ఇట్టి విషయంలో మృతుడి తమ్ముడు అజయ్ చౌరస్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభిస్తునామని తెలిపారు.మృతుడికి భార్య, ఒక కుమారుడు,కుమార్తె వున్నారు.మృతుడు సుంకిశాల ప్రాజెక్ట్ లో క్రేయిన్ ఆపరేటర్ గా పని చేస్తున్నారని,అతని కుటుంబ సభ్యులు బీహార్ లో వుంటున్నారని పోలీసులు తెలిపారు. బ్రేక్ డౌన్ అయిన టిప్పర్ ను రోడ్డు డించకుండా రోడ్డు మీద పార్కు చేసి వెళ్లిపోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయిని అరికట్టేందుకు స్పెషల్ ఫోకస్, స్పెషల్ టీమ్స్ ఏర్పాటు

- సంవత్సర కాలంలో 650 కేజీల గంజాయి సీజ్
- 25 కేసుల్లో 59 మంది నిందితుల అరెస్ట్
- ఒకరి పై పీడీయాక్ట్ నమోదు
- ఎస్పీ రాహుల్ హెగ్డే

నవతెలంగాణ-సూర్యాపేట

జిల్లాలో గంజాయి నిరోధానికి, గంజాయికి అలవాటు పడ్డవారిని గుర్తించడానికి పోలీస్ స్పెషల్ ఫోకస్ పెట్టడంతో పాటు ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు.గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సమాజంలో యువశక్తిని నిర్వీర్యం చేస్తుందని, దీని మూలాలను సమూలంగా నాశనం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఎస్పీ కోరారు. గంజాయి నిరోధానికి పట్టిష్టంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. యువకులు గంజాయి మత్తుకు బానిసలు కావొద్దని సూచించారు. విద్యార్థులు, యువకులు ఎవరైనా గంజాయి మత్తుకు అలవాటు పడ్డారా అనేది తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గమనించి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. గతంలో గంజాయి రవాణాకు పాల్పడిన నేరస్తులను గంజాయి వినియోగానికి అలవాటు పడిన వ్యక్తులను, యువతను గమనిస్తున్నామని వారిపై నిఘా ఉంచామని తెలిపారు. గంజాయి రవాణా చేసే వారిని గంజాయి వినియోగిస్తున్న వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. గత సంవత్సర కాలంగా గంజాయి నిరోధంపై



ఉక్కు పాదం మోపమని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లా పోలీస్ శాఖ 650 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని 25 కేసులు నమోదు చేసి 59 మందిని అరెస్టు చేయడం జరిగిందని వివరించారు. ఒకరిపై పిడియాక్ట్ నమోదు చేశామని పేర్కొన్నారు.

రేపటి జనరల్ బాడీ సమావేశం వాయిదా

- అసంబ్లీ సమావేశాల తరువాతనే
- నూతన ఎంఎల్ ఏ ఆధ్వర్యంలో సమావేశం

నవతెలంగాణ-పెద్దవూర

ఈనెల 16న జరుగవలసిన జనరల్ బాడీ సమావేశము ఈ నెల 28కి వాయిదా పడింది.రేపటినుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడంతో వాయిదా వేసినట్లు పెద్దవూర మండల ప్రజాపరిషత్ సూపరిండెంట్ ఎండీ హఫీజ్ ఖాన్ గురువారం తెలిపారు. అసంబ్లీ ఎన్నికలు తరువాత మొట్టమొదటి సారిగా జరగనున్న ఈ సమావేశం స్థానిక నూతన ఎంఎల్ఏ కుందూరు జయవీర్ రెడ్డి హాజరువు తున్నందున అసంబ్లీ సమావేశాల తరువాతనే నిర్వహింస్తున్నట్లు ఆయన తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నిర్వహిస్తున్న ఈసమావేశాని ప్రాముఖ్యత సంతోషం రించుకుంది. మండలంలో ఇంకా అనేక సమస్యలు పరిష్కారంకాక గత పదేళ్లగా సమస్యలు సమస్యలు గానే మిగిలాయి. అయితే ఆసమస్యలు



సత్వర పరిష్కారానికి సభ్యులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎంఎల్ ఏ సమక్షంలో ఈసమావేషాన్ని నిర్వహించేలా అధికారులు సూస్తున్నారు. అంతే గాక ఎన్నికల ముందు పెద్దవూరకు వచ్చిన ఎంపిడీఓ రమేష్ దీన దయాళ్ ఎన్నికల తరువాత మళ్ళీ నకిరేకల్ కల్ కు ట్రాన్సుర్ అయ్యారు. ఎంపీఓ అనారోగ్యంతో సెలవులో వున్నారు.దాంతోప్రజా ప్రతినిధులు, అధికారులు ఎంఎల్ ఏ సమక్షంలో సమావేశం నిర్వహించాలని ఆలోచనలో వున్నట్లు తెలుస్తుంది.

నకిరేకల్ ఎంపీడీవోగా రమేష్ దీన్ దయాల్ బాధ్యతలు



నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ ఎంపీడీవోగా కె రమేష్ దీన్‌దయాల్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన అండాలు మాడుగులపల్లి ఎంపీడీవోగా బదిలీఅయి వెళ్లారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎంపీడీవోను ఎంపీపీ బచుపల్లి శ్రీదేవి గంగాధరరావు, ఎంపీఓ నాగలక్ష్మి, తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి గుండెబోయిన శ్రీనివాస్, సిబ్బంది నవీన్ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఉచిత కంటిపరీక్షల శిబిరం ఏర్పాటు

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

జిల్లా కేంద్రంలోని యూటిఎఫ్ భవన్‌లో మ్యాక్సివిజన్ శ్రీ మహాలక్ష్మి కంటి ఆసుపత్రి వనస్థలిపురం హైదరాబాద్ వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు టాప్రా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్ చంద్ర, పందిరి శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు చేస్తారని కావున విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రులందరు హాజరై ఉచితంగా కంటి పరీక్షలు చేసుకోవాలని కోరారు.